# అన్నమాచార్యుల సంకీర్తనలు



దాఁచుకొనీ పాదాలకుఁ
దగనేజేసిన పూజలివి
పూఁచీ నీకీరితి రూపు
పుష్పము లివి యయ్యా

ఒక్క సంకీర్తనే చాలు
వొద్దికై మమ్మురక్షించఁగ
తక్కినవి భండారాన
దాఁచి వుండనీ

వెక్కసము నీ నామము
వెల సులభము ఫలమధికము
దిక్కై సన్నేలితి విఁకనవి
తీరని నాధనమయ్యా.

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ

# అన్నమాచార్యుల సంకీర్తనలు

కూర్పు :

కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి, ఎం. ఎ.,

తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీకార్యనిర్వాహకులగు

శ్రీ పి. యస్. రాజగోపాలరాజు, ఐ.ఎ.యస్. గారి

అధికారమున ప్రకటింపబడినది.

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము

తి రు ప తి

1982

ANNAMACHARYULA SAMKIRTANALU

by

KAMISETTY SRINIVASULUSETTY, M.A.,

T. T. D. Religious Publications Series No. 128.

Second Edition.

Copies : 5 ,000

Published by :

Sri P. V. R. K. PRASAD, I.A.S.,
Exeutive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati.

Printed at :

T. T. D. Press, Tirupati.

# విషయసూచిక


| | పుట |
|---|---|
| తొలిపలుకు | V |
| మనవి | VII |
| సంకీర్తనల అకారాది సూచిక | IX |
| రాళ్లపల్లివారి అభిప్రాయం | .... IIIX |
| సంకీర్తనలు | 2 |
| అనుబంధం | 61 |



శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య ఇరువది తొమ్మిదవ
వర్ధంతి సందర్భమున
ఆవిష్కరింపబడినది.

[25-3-1977]

# తొలిపలుకు

తొలితెలుగు వాగ్గేయకారుడని కీర్తింపబడిన తాళ్లపాక అన్నమాచార్యుడు వేంకటేశ్వరుని పరమభక్తుడు. తాను నమ్మి కొలిచిన దైవానికే తన కృతులను అంకితంచేసినాడు. సుమారు 32,000 సంకీర్తనలను రచించినాడన్న కీర్తినిపొందిన ఈ సంకీర్తనాచార్యుడు ఒక్క పాటలోకూడ తన పేరును ప్రకటించుకోలేదు.

"నా నాలికపైనుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్నుఁబొగడించితివి
వే నామాల వెన్నుండా వినుతించనెంతవాఁడ
కానిమ్మని నాకీ పుణ్యముగట్టితి వింతేయయ్యా."

అని తన పేరనున్న కైంకర్యము వేంకటేశ్వరునిదే అని విశ్వసించి చాటిన పరమభాగవతోత్తముడితడు. ఆ మహాభక్తకవిసార్వభౌముని వర్ధంతినాడు అతని సేవాకైంకర్యంగ తెలుగువారికి మేమందించే చిరుకానుక ఇది.

అన్నమాచార్య సంకీర్తనలను కొన్నింటిని సంకలనంచేసి ఆ గ్రంథాన్ని శ్రద్ధాళువులైన గాయకులకు, సాహిత్యరసికులకు అందజేయాలనే సంకల్పంతోనే దీనిని ప్రచురించడం జరిగింది. ఈ పాటలన్నీ మేము ఇంతవరకు ప్రచురించిన అన్నమాచార్య సంకీర్తనల సంపుటాలనుండి ఎత్తి కూర్చినవే. ఆ పనిని నిర్వహించినది అన్నమాచార్య వాఙ్మయం గురించి పరిశోధన సాగిస్తున్న కామిశెట్టి శ్రీనివాసులుశెట్టిగారు.

ప్రధానంగ సుప్రసిద్ధ సంగీతవిద్వాంసులు శ్రీయుతులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీపాద పినాకపాణి, నేదునూరి కృష్ణమూర్తి అన్నమయ్య కృతులకు స్వరాలు సంతరించి గానంచేసి వాని వ్యాప్తికి

తోడ్పడుతున్నారు. శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీనేదునూరి కృష్ణమూర్తి స్వరపరచిన అన్నమయ్య పాటల పుస్తకమును శ్రీనివాసులుశెట్టిగారి భావ వివరణంతో ఈమధ్యనే ప్రచురించినాము. తిరుపతిలో ప్రతి శనివారం జరిగే అన్నమాచార్య సారస్వత కళా రాధనలో పాల్గొని శ్రీ నేదునూరి కృష్ణమూర్తి తదితర సంగీత కళాశాల విద్వాంసులు ఈ సంకీర్తనల ప్రచారానికి ఎంతో సహకరించి నారు. వారి కృషి అభినందనీయమైనది.

మా అభ్యర్థనను మన్నించి ఎందరో గాయకులు ఈ అన్నమా చార్య సంకీర్తనలు పాడి ప్రచారంచేస్తున్నారు. వారందరికీ మా హార్దమైన ధన్యవాదాలు. ఈ పాటలలోని రసానుభవమును ప్రజల కందరికిని పంచిపెట్టవలసిన బాధ్యత భావుకులైన పండితులు, గాయ కుల మీదనే ఉన్నది.

తిరుపతి,
23-3-1977.

పి. యస్. రాజగోపాలరాజు
ప్రకాశకులు

# మనవి

అన్నమాచార్యుల సంకీర్తనలు కొన్ని సంకలనం చేసి ఈ అన్నమాచార్య వర్ధంతికి ఆవిష్కరించవలె నను అధికారుల సంకల్పాన్ని నాకు తెలియచేసినవారు నేదునూరి కృష్ణమూర్తిగారు. ఈ పుస్తకం గాయకులకోసం ఉద్దేశింపబడిందే కాబట్టి నేదునూరివారు నేను కలిసి పాటలను ఎన్నిక చేయడం జరిగింది. "భగవన్నామములకు అష్టోత్తరమొక పవిత్ర సంఖ్యగా పెద్దలందరు అంగీకరించినారు. సంపుటము చేతి కదమగానుండవలెనని దాని సగముగ 54 కృతులను ఇప్పుడు ప్రకటించుటయైనది" అని ఒకానొకచోట పూజ్యులు గురుపాదులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు వ్రాసినారు. వారి మార్గాన్నే నేనూ అనుసరించి ఈ సంకలనంలో 54 పాటలను చేర్చినాను. శక్తిసామర్థ్యాలకంటె అన్నముని వాఙ్మయంమీద నాకుగల శ్రద్ధాభక్తులే నన్నీ కార్యమును చేపట్టుటకు ప్రేరేపించినవి.

తొలుత ముద్రితప్రతులలోని పాటలను రాగిరేకుల వ్రాతతో సరిపోల్చి ప్రకటించవలెనను చాపల్యం కలిగింది. కీ. శే. ప్రభాకరశాస్త్రిగారు, శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, గౌరిపెద్ది రామసుబ్బశర్మ వంటి మహాపండితులు పరిష్కరించి ప్రకటించిన సంకీర్తనలను పునః పరిశీలించుట అనుచితము, అనావశ్యకమని ఆ పనినుండి విరమించినాను. వీరి పరిష్కరణ భాగ్యం పొందిన ముద్రితప్రతులను ఆధారంగ చేసుకొని ఈ సంకలనంలో సంకీర్తనలను సమకూర్చినాను. తాళ్లపాకవారి పాటలకు ఓంప్రథమంగ స్వరాలను సంతరించిన కీర్తనీయచరితులు రాళ్లపల్లి వంతకృష్ణశర్మగారు తర్వాత అట్టిపనికి పూనుకొన్నవారు నేదునూరి కృష్ణమూర్తిగారు. గాయకుల సౌకర్యార్థం ఆయా పాటల క్రింద వీరిరువురు కావించిన స్వరకల్పనలను సూచించినాను. వస్తుస్వరూపం తెలియడానికి క్లుప్తంగ ప్రతిపాటకు అవతారికను చేర్చినాను. సంకీర్తనల కూర్పుకు సంబంధించిన వివరాలను నాతివిస్తరంగ అనుబంధంలో చర్చించినాను. కీర్తనలలోని శబ్దార్థాలను గురించి చర్చించే అవకాశం ఈ సందర్భంలో లేకపోయింది

ఈ పాటల కూర్పులో పూజ్యులు రాళ్లపల్లివారు స్వరపరచి ప్రకటించిన తాళ్లపాక పాటల సంపుటాలు రెండూ నాకు ఎంతగనో ఉపకరించినవి. వారికి నా వినయపూర్వకమైన కృతజ్ఞతాంజలులు

అన్నమాచార్యుని సారస్వతమందార మకరందాలను తెలుగుజాతి తృప్తిగ ఆస్వాదించే కాలం ఆసన్నమైంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఛేర్మన్ సి. అన్నారావుగారు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి. యస్. రాజగోపాలరాజుగారు తాళ్లపాకవారి వాఙ్మయాన్ని దేశవ్యాప్తంచేయాలని దీక్షవూనినారు. పవిత్ర సుందరమైన వీరి సంకల్పం ఫలవంతం కావలెనని తిరువేంకటాచలపతిని ప్రార్థిస్తున్నాను. ఈ వర్ధంతి నాటికి ఈ పాటం పొత్తాన్ని కళారసికులకు అందజేయదలచిన వీరి ఔదార్యం వెలలేనిది.

అనతికాలంలో ఈ సంకలన గ్రంథాన్ని చేపట్టినా సకాలంలో దీనిని అచ్చొత్తించే బాధ్యతను స్వీకరించి నిర్వహించిన దేవస్థానం పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ రామస్వామిగారికి, ప్రెస్ మేనేజర్ విజయకుమార్ రెడ్డిగారికి నా కృతజ్ఞతలు. ఈ సంపుటాన్ని ఆద్యంతాలు సొగసుగ నిర్దుష్టంగ తయారుచేయాలని భక్తిశ్రద్ధలతో పనిచేసిన సాంకేతిక సిబ్బందికి నా హార్దమైన ధన్యవాదాలు.

ఈ ప్రతిని తయారుచేయడంలో నాకు తోడ్పడిన ఆత్మీయమిత్రము చేట్లూరు శేషాద్రికి, చి॥ కె. టి. హేమలతకు భగవంతుడు శ్రీనివాసుని మంగళాశాసనాలు.

నా పేరనున్న ఈ కైంకర్యము నిజమునకు రసహృదయులందరిది.

"దేవుడాతఁడె నేఁడు తెలిసి కొలిచెఁగాని
భావించ కిన్నాళ్లదాఁకా భ్రమపడె జీవుండు"

తిరుపతి,
25-3-1977.

కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి.

శ్రీః

# సంకీర్తనల అకారాది సూచిక


| సంకీర్తన | రాగము | పుట |
|---|---|---|
| అలమేలుమంగ | పాడి | 4 |
| ఆలరించుచల | ఆహిరి | 54 |
| అలరులు గురియఁగ | శంకరాభరణం | 3 |
| ఆఁకటి వేళల | ముఖారి | 26 |
| ఇందరికి నభ | సామంతం | 39 |
| ఇట్టిముద్దు | దేవగాంధారి | 19 |
| ఇతరులకు నిను | శ్రీరాగం | 35 |
| ఇదిగాక సౌభాగ్య | ముఖారి | 10 |
| ఇప్పుడిటు | భూపాళం | 32 |
| ఉగ్గువెట్టరే | భైరవి | 20 |
| ఉయ్యాలా | శంకరాభరణం | 23 |
| ఎండగాని | బౌళి | 49 |
| ఏమొకొ చిగురు | నాదరామక్రియ | 8 |
| కంటి శుక్ర | ...... | 37 |
| కులుకక నడవరో | దేసాళం | 5 |
| కొనరో కొనరో | శంకరాభరణం | 42 |
| కొమ్మతన ముత్యాల | ఆహిరి | 15 |
| కొలనిదోఁపరికి | దేసాళం | 53 |
| గురుతెఱిఁగిన | శంకరాభరణం | 52 |
| ఘుమ్మని యెడి | పాడి | 22 |
| చక్కని తల్లికి | పాడి | 6 |
| చూడఁజూడ | వరాళి | 36 |

| సంకీర్తన | రాగము | పుట |
|---|---|---|
| చూడుఁడిందరికి | భైరవి | 41 |
| చేరి కొల్వరో | శ్రీరాగం | 33 |
| చేరి యశోదకు | శుద్ధవసంతం | 16 |
| జయజయరామా | గుండక్రియ | 29 |
| జవ్వాది మెత్తినది | శంకరాభరణం | 13 |
| జోవచ్యుతానంద | ... .... | 56 |
| తందనాన | బౌళి | 50 |
| తరుణి నీ | శంకరాభరణం | 11 |
| తెప్పగా మఱ్ఱాకు | లలిత | 40 |
| దిబ్బలు వెట్టుచు | కాంభోజి | 48 |
| దీనుఁడ నేను | శుద్ధవసంతం | 24 |
| దేవదేవంభజే | ధన్నాసి | 31 |
| నానాటి బదుకు | ముఖారి | 25 |
| నారాయణతే | పాడి | 28 |
| పలుకుఁదేనెల | సాళంగనాట | 7 |
| పలుమరువుట్ల | ముఖారి | 21 |
| పొడగంటిమయ్యా | శంకరాభరణం | 34 |
| పొద్దికనెన్నఁడు | సామంతం | 12 |
| బ్రహ్మగడిగిన | ముఖారి | 38 |
| భక్తికొలఁది | రామక్రియ | 43 |
| భావములోన | దేసాళి | 27 |
| భోగీంద్రులును | ముఖారి | 45 |
| మరలి మరలి | రామక్రియ | 59 |
| మలసీఁ జూడరో | శంకరాభరణం | 48 |
| ముద్దుగారే | సాళంగనాట | 18 |
| మొత్తకురే | కాంభోజి | 17 |

| సంకీర్తన | రాగము | పుట |
|---|---|---|
| వలదన నోరు | సామంతం | 9 |
| విన్నపాలు | భూపాళం | 2 |
| విరహాపు రాజదె | సామంతం | 14 |
| శరణు శరణు | మాళవి | 30 |
| సువ్వి సువ్వి | కేదారగౌళ | 46 |
| క్షీరాబ్ధి కన్య | మంగళకౌశిక | 58 |


## సంకేతములు

| | | |
|---|---|---|
| రా. అ. కృ. శర్మ. | .... | రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ |
| నే. కృ. | .... | నేదునూరి కృష్ణమూర్తి |
| తా. పా. | ... | తాళ్లపాక పాటలు [రెండు సంపుటాలు] |
| తా. అ. పా. | .... | తాళ్లపాక అన్నమయ్య పాటలు |



[తాళ్లపాకవారి పాటలను పాడే పద్ధతులను గురించి
సంగీతకళానిధి శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ
గారి అభిప్రాయము.]

"ఈ పాటలకు రేకులలో పేర్కొనఁబడిన రాగము లన్నియు ఇంచు మించు ప్రాఁతఁబడి నవ్యతను గోల్పోయినవనియు, కనుక ఇప్పుడు జనప్రియమైన క్రొత్తక్రొత్త రాగములలో పోకడలలో వీనిని పొదిగించిననే తప్ప లోకులు వీని నాదరింపరనియు పలువురికి సందేహమున్నది. కొంత నిజమే. కాని రాగముల రక్తికి వాని స్వరూపమున కంటె పాడునట్టి కలావంతుని ఆధ్యాత్మిక చిత్తవృత్తి ముఖ్యకారణమని నా యనుభవము. ఏ రాగమందు రచించిన యే కృతినైనను మఱి యే రాగమందైనను పాడవచ్చుననుట సామాన్య సంగీత విద్యార్థులుగూడ ఎఱిఁగిన విషయమే. కనుక రాగభేదము చేత రక్తికలుగుననుట చాలా స్థూలమైన అభిప్రాయము. మఱియు నేఁటి క్రొత్త రేపటికి ప్రాఁతగా మారక తీరదు. ఇంతేకాదు, కర్త యుపయోగించిన పదములు భావములును ప్రాఁతపడినట్లు మనకు తోఁచవచ్చును గదా. అప్పుడు వానిని గూడ మన రుచికిఁ దగినట్లు మార్చుటకు పూనుకొంటిమేని మన నవ్యప్రియత్వపు దెబ్బకే ప్రాచీన మహాకవియును తట్టుకోలేడు। కనుక కళోపాసకు లుపయోగించిన పరికరముల యంతస్తును మీఱి లోఁతుకు దిగి వారి యాధ్యాత్మికవృత్తులను గ్రహించి యనుభవించుటయే కళారసికుల ప్రయత్నము గావలయును .... .... .... తాళ్లపాకవారి రచనలు అర్థభావప్రధానములైనవి. త్యాగరాజ దీక్షితాదులవానివలె నాదరచనా ప్రధానములు గావు. కనుక గాయకులు ఆ దృష్టితో సాధించి పాడిరేని తప్పక సభ్యుల నాకర్షింపఁగలరని నా నమ్మిక .... ...."

[ తాళ్ళపాక పాటలు Vol I ఉపోద్ఘాతము పు. 12—14 ]



## శ్రీరాగం

పల్లవి:

దినము ద్వాదశి నేఁడు - తీర్థదివసము నీకు
జనకుండ అన్నమాచార్యుఁడ విచ్చేయవే. ॥ దినము ॥

చరణములు:

అనంత గరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘననారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన - దైవశిఖామణి తోడ
వెనుకొని యారగించ - విచ్చేయవే. ॥ దినము ॥

వైకుంఠాన నుండి యాళువారల లోపలనుండి
లోకపు నిత్య ముక్తుల - లోననుండి
శ్రీకాంత తోడ నున్న - శ్రీ వేంకటేశుఁగూడి
యీకడ నారగించ - వింటికి విచ్చేయవే. ॥ దినము ॥

సంకీర్తనముతోడ - సనకాదు లెల్లఁబాడ
పొంకపు శ్రీ వేంకటాద్రి - భూమినుండి
లంకె శ్రీ వెంకటగిరి - లక్ష్మివిభుఁడు నీవు
నంకెల మాయింటి విందు లారగించవే.

[VI–151]

# 1

[ ఇది మేలుకొలుపు. అలమేలుమంగా వల్లభునికి మేలుకొలుపు. సకల చరాచరసృష్టికే మేలుకొలుపు. ]

*భూపాళం

పల్లవి :

విన్నపాలు వినవలె - వింత వింతలు

అనుపల్లవి :

పన్నగపు దోమతెర - పైకెత్తవేలయ్యా ॥ విన్న ॥

చరణములు :

1. తెల్లవారె జామెక్కె - దేవతలు మునులు
అల్లనల్ల నంతనింత - నదిగోవారే
చల్లని తమ్మిరేకుల - సారసపుఁగన్నులు
మెల్లమెల్లనె విచ్చి - మేలుకొనవేలయ్యా: ॥ విన్న ॥

2. గరుడ కిన్నరయక్ష - కామినులు గములై
విరహపుగీతముల - వింతాలాపాల
పరిపరివిధములఁ - బాడేరునిన్నదివో
సిరిమొగముదెరచి - చిత్తగించవేలయ్యా. ॥ విన్న ॥

3. పొంకపు శేషాదులు తుం - బురునారదాదుల
పంకజభవాదులు నీ - పాదాలు చేరి
అంకెలనున్నారు లేచి - అలమేలుమంగను
వేంకటేశుఁడా రెప్పలు - విచ్చి చూచి లేవయ్యా. ॥ విన్న ॥

[IV–25]

* చూడు— స్వరకల్పన రా. అ. కృ. శర్మ, భూపాళరాగం నిర్దేశింపబడింది.తా. అ. పా. పు. 13.

# 2

[ఇది అలమేలుమంగ దివ్యనృత్యపుపాట. ఆమె అభినయము అభినవ శృంగారాలను ఒలకబోసినది. అంగజగురుడైన శ్రీనివాసుడే సిరిమురిపెములను మెచ్చినాడు.]

*శంకరాభరణం

పల్లవి :

అలరులు గురియఁగ - నాడెనదే
అలకలఁగులుకుల - నలమేలుమంగ. ॥ అలరు ॥

చరణములు :

1. అరవిరి సొబగుల - నతివలు మెచ్చఁగ
అర తెర మరుగున - నాడె నదే
వరుసగ పూర్వదు - వాళపు తిరుపుల
హరిఁగరగింపుచు - నలమేలుమంగ. ॥ అలరు ॥

2. మట్టపు మలపుల - మట్టెల కెలపుల
తట్టెడి నడపుల - దాటెనదే
పెట్టిన వజ్రపు - పెండెపు దళుకులు
అట్టిటు చిమ్ముచు - నలమేలుమంగ. ॥ అలరు ॥

3. చిందుల పాటల - శిరిపొలయాటల
అందెల మ్రోతల - నాడె నదే
కందువ తిరువెం - కటపతి మెచ్చఁగ
అందపు తిరుపుల - నలమేలుమంగ. ॥ అలరు ॥

[XII-24]

* చూడు— స్వరకల్పన. రా. అ. కృ. శర్మ, ఆదితాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. పు. 1

# 3

[ అలమేలుమంగమ్మ అందము, అభిజాత్యము, అధికారము, రాసిక్యము విశదపరచే పదమిది. ]

## *పాడి

పల్లవి :

అలమేలుమంగ నీ - వభినవ రూపము
జలజాక్షు కన్నులకు - చవులిచ్చేవమ్మా. ॥ అల ॥

చరణములు :

1. గరుడాచలాధీశు - ఘనవక్షమున నుండి
పరమానంద సంభరితవై
నెరతనములు చూపి - నిరంతరము నాథుని
హరుషించఁగఁ జేసితి గదమ్మా. ॥ అల ॥

2. శశికిరణములకు - చలువల చూపులు
విశదముగా మీఁద - వెదచల్లుచు
రసికత పెంపునఁ - గరఁగించి యెప్పుడు నీ
వశము చేసుకొంటి - వల్లభు నోయమ్మా. ॥ అల ॥

3. రట్టడి శ్రీ వేంకట - రాయనికి నీవు
పట్టపురాణివై - పరఁగుచు
వట్టి మాఁకు లిగిరించు - వలపుమాటల విభు
జట్టిగొని పురమున - సతమైతివమ్మా. ॥ అల ॥

[XII–159]

---

చూడు— స్వరకల్పన భైరవి రాగంలో. వే. కృ, ఖండచాపుతాళం నిర్దేశింపబడింది.
తా. అ. పా. పు. 86

# 4

[ఇది అలమేలుమంగ మెరవణి. క్రొత్తపెండ్లి కూతురి సింగారంతో మంగమ్మ పల్లకిలో ఊరేగి కల్యాణవేదిక చేరడం ఈ పాటలో విషయం. అమ్మవారి పల్లకిని ఆడవాళ్లే మోయడం విశేషం.]

* దేసాళం

పల్లవి :

కులుకక నడవరో - కొమ్మలాలా
జలజల రాలీని - జాజులు మాయమ్మకు. ॥ కులుక ॥

చరణములు :

1. ఒయ్యనే మేను గదలీ - నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీపాదతాఁకు - కాంతలాలా
పయ్యెద చెఱఁగు జారీ - భారపు గుబ్బల మీఁద
అయ్యో చెమరించె మా - యమ్మకు నెన్నుదురు. ॥ కులుక ॥

2. చల్లెడి గందవొడిమై - జారీ నిలువరో
పల్లకి వట్టిన ముద్దు - బణఁతులాల
మొల్లమైన కుందనపు - ముత్యాల కుచ్చులదర
గల్లనుచుఁ గంకణాలు - గదలీమాయమ్మకు. ॥ కులుక ॥

3. జమళి ముత్యాల తోడి - చమ్మాళిగ లిడరో
రమణికి మణుల - నారతు లెత్తరో
అమరించి కౌఁగిట - నలమేలు మంగనిదె
సమకూడె వేంకటేశ్వరుఁడు మా యమ్మకు ॥ కులుక ॥

[XII-73]

* చూడు— స్వరకల్పన—అఠాణరాగం. వే. కృ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. 143

# 5

[ అలమేలుమంగ సౌందర్యం అసాధారణమైనది. ఆమె చూపులు, పలుకులు, చేష్టలు పారవశ్యమును కలిగించునవి. అందుకే అద్భుతమైన ఈ రసానందంలో ఓలలాడిన సంకీర్తనాచార్యుడు అమ్మవారి అందాన్ని "చాంగు-భళా," అని ప్రశంసించినాడు. ]

*పాడి

పల్లవి:

చక్కని తల్లికి - చాంగుభళా తన
చక్కెర మోవికి - చాంగుభళా. ॥చక్కని॥

చరణములు:

1. కులికెడి మురిపెపు - కుమ్మరింపు తన
సళుపు జూపులకు - చాంగుభళా
పలుకుల సొంపుల - బతితోఁగసరెడి
చలముల యలుకకు - చాంగుభళా. ॥చక్కని॥

2. కిన్నెరతో పతి - కెలన నిలుచు తన
చన్ను మెఱుఁగులకు - చాంగుభళా
ఉన్నతిఁబతిపై - నొరగి నిలుచు తన
సన్నపు నడిమికి - చాంగుభళా. ॥చక్కని॥

3. జందెపు ముత్యపు - సరులహారముల
చందన గంధికి - చాంగుభళా
విందయి వెంకట - విభుఁబెనఁచినతన
సంది దండలకు - చాంగుభళా. ॥చక్కని॥

[XII-107]

---

* చూడు- స్వరకల్పన-రా. అ. కృ. శర్మ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. పు. 65

# 6

[రేయి విభునితో నిద్దురలేమి అలమేలుమంగ పగలైనదాక పవ్వళించినది. ఆ కలికి తన చెదరిన అందాలను ముత్యాల మంచముపై పరచినది. చెలులు పడకటిల్లుచేరి గుసగుసలు పోయినారు. ఆ సఖులలో అన్నమయ్య ఒక సఖియైనిలిచినాడు.]

* సాళంగనాట

పల్లవి:

పలుకుఁదేనెల తల్లి - పవళించెను

అను పల్లవి:

కలికి తనముల విభుని - గలసినది గాన. ॥ పలుకు ॥

చరణములు:

1. నిగనిగని మోముపై - నెఱులు గెలఁకులఁజెదర
పగలైన దాఁకఁ జెలి - పవళించెను
తెగని పరిణతులతో - తెల్లవారినదాఁక
జగదేక పతి మనసు - జట్టిగొనెఁగాన. ॥ పలుకు ॥

2. కొంగు జారిన మెఱుఁగు -గుబ్బ లొలయఁగఁదరుణి
బంగారు మేడపైఁ - బవళించెను
చెంగలువ కనుఁగొనల - సింగారములు దొలఁక
అంగజ గురునితోడ - నలసినదిగాన. ॥ పలుకు ॥

3. మురిపెంపు నటనతో - ముత్యాల మలఁగుపై
పరవశంబునఁ దరుణి - పవళించెను
తిరు వేంకటాచలా - ధిపుని కౌఁగిటఁగలసి
అరవిరై నునుజెమట - నంటినదిగాన. ॥ పలుకు ॥

[IV–74]

* చూడు– స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. ఖండచాపు తాళం నిర్దేశింపబడింది. తా. పా. Vo. II పు. 94 మరియు స్వరకల్పన–కర్ణాటకదేవగాంధారిరాగంలో–నే. కృ. తా. అ. పా. పు. 164

# 7

[అప్పుడే కేళికామందిరము వెడలివచ్చిన నాయికను పట్టుకొని చెలికత్తెలు పరియాచకాలాడుట ఇందలి వస్తువు. పద్మావతీదేవి పడకటింటి రహస్యాలను చెలులంతా కలసి రచ్చకెక్కించినారు.]

*నాదరామక్రియ

పల్లవి:

ఏమొకొ చిగురుటధరమున - యెడనెడఁ గస్తూరి నిండెను
భామిని విభునకు వ్రాసిన - పత్రిక కాదు గదా. ॥ఏమొకొ॥

చరణములు:

1. కలికి చకోరాక్షికిఁ గడ - కన్నులు కెంపై తోఁచిన
చెలువం బిప్పుడిదేమో - చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై - నాఁటిన యాకొన చూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన - నెత్తురు కాదు గదా. ॥ఏమొకొ॥

2. పడఁతికి చనుగవ మెఱుఁగులు - పైపై పయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో - కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ - బ్రియుఁడొత్తిన నఖశశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు - వెన్నెలకాదుగదా ॥ఏమొకొ॥

3. ముద్దియ చెక్కుల కెలఁకుల - ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో - వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి - కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁ జెమటల - అందము కాదుగదా ॥ఏమొకొ॥

[XII–82]

---

* చూడు— స్వరకల్పన తిలంగ్‌రాగంలో - నే. కృ. రూపకతాళం నిర్దేశింపబడింది. తా.అ.పా. 149

# 8

[ఇది మధుర పద్ధతికి సంబంధించిన శృంగారం. తరుణికి అందాలు సహజంగ సంప్రాప్తమైనవి. వలదనుటకు వలయు ననుటకు మనమెవ్వరము. భగవత్ సంకల్పం అది.]

## సామంతం

పల్లవి :

వలదన నొరులకు - వసమటవే
తలఁచినట్ల నిది - దైవమె చేసె. ॥ వల ॥

చరణములు :

1. తరుణి కుచములను - తామర మొగుడలు
విరిసేనో యని - వెరపునను
సరగునఁబతి నఖ - చంద్రశకలములు
దరులఁగలుగ నివి - దైవమె చేసె. ॥ వల ॥

2. పొలఁతి వదనమను - పున్నమ చంద్రుఁడు
బలిమి నెగయునని - భయమునను
మెలుత చికుర ధ - మ్మిల్లపు రాహువు
తలఁజెదరఁగ నిది - దైవమె సేసె. ॥ వల ॥

3. వనితకు వాడునో - వలపు తాపమున
తనులతిక యనుచుఁ - దమకమున
ఘన వేంకటపతి - కౌఁగిట చెమటలఁ
దనివి దీర్చనిది - దైవమె సేసె. ॥ వల ॥

[VI-17]

# 9

[శృంగారభక్తిరసములు రెండును పరిణతమైన సమాధిదశలో
ఒక్కటే అని ప్రతిపాదించు పద మిది.]

* ముఖారి

పల్లవి :

ఇదిగాక సౌభాగ్య - మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం - బిఁక నొకటి కలదా ॥ ఇది ॥

చరణములు :

1. అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్ష - లిన్నియును విడిచె
సతికోరికలు మహా-శాంతమై యిదెచూడ
సతత విజ్ఞాన వా - సనవోలె నుండె ॥ ఇది ॥

2. తరుణి హృదయము కృ - తార్థతఁ బొంది విభుమీఁది
పరవశానంద సం - పదకు నిరవాయ
సరసిజానన మనో - జయ మంది యింతలో
సరిలేక మనసు ని - శ్చలభావమాయ ॥ ఇది ॥

3. శ్రీ వేంకటేశ్వరునిఁ - జింతించి పరతత్త్వ
భావంబు నిజముగాఁ - బట్టెఁజెలియాత్మ
దేవోత్తముని కృపా-ధీనురాలై యిపుడు
లావణ్యవతికి ను - ల్లంబు దిరమాయ ఇది ॥

[XII-17]

---

* చూడు– స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. జంపె తాళం నిర్దేశింపబడింది. తా. పా. Vo. I
పు. 37.

# 10

[తరుణిపై పతి అలుక పూనినాడు. ప్రియుని బాసిన నాయిక ఉన్మాదిని అయినది. మగువను కరుణించి మన్నించుమని ఒక సఖి నాయకుని బ్రతిమిలాడుచున్నది.]

## శంకరాభరణం

పల్లవి:

తరుణి నీ యలుక కెం - తటి దింతి నీ వేళఁ
గరుణించఁగదర - వేంకటశైలనాథా. ॥ తరుణి ॥

చరణములు:

1. ఒకమారు సంసార - మొల్లఁబొమ్మని తలఁచు
ఒక మారు విధినేఁత - లూహించి పొగడు
ఒక మారు తనుఁజూచి - పూరకే తలవూఁచు-
నొకమారు హర్షమున - నొంది మే మఱచు. ॥ తరుణి ॥

2. నిన్నుఁజూచి ఒకమారు - నిలువెల్లఁ బులకించు
తన్నుఁజూచి వొకమారు - తలపోసి నగును
కన్ను దెరచి నినుఁజూచి - కడుసిగ్గువడిసిలిచి
యిన్నియునుఁ దలపోసి - యింతలో మఱచు. ॥ తరుణి ॥

3. వదలైన మొలనూలు - గదియించు నొకమారు
చెదరిన కురులెల్లఁ - జెరుగు నొకమారు
అదనెరిఁగి తిరువేంక - టాధీశ పొందితివి
చదురుఁడవు నినుఁ బాయఁ - జాల దొకమారు. ॥ తరుణి ॥

[X I–70]

# 11

[విరహిణి సఖితో ప్రాణసఖునకు సందేశమంపినది. పోయిన చెలి ఎంతసేపటికి తిరిగిరాలేదు. ఇంతలో నాయిక అవస్థ చెప్ప నలవి కాలేదు. ఈ మృదువైన సన్నివేశమును అన్నమయ్య ఎంతో మధురంగ చిత్రించినాడు.]

## సామంతం

పల్లవి :

పొద్దికనెన్నఁడు వొడచునొ - పోయిన చెలిరాదాయను
నిద్దుర గంటికిఁ దోఁపదు - నిమిషంబొక యేఁడు. ॥పొద్దిక॥

చరణములు :

1. కన్నుల నవ్వేడి నవ్వులు - గబ్బితనంబుల మాటలు
నున్నని యొయ్యారంబులు - నొచ్చిన చూపులును
విన్నఁదనంబుల మఱపులు - వేడుక మీరిన యలపులు
సన్నపుఁజెమటలుఁదలఁచిన - ఝల్లనె నా మనసు. ॥పొద్దిక॥

2. అఁగిన రెప్పల నీరును - నగ్గలమగు పన్నీటను
దోఁగియుఁదోఁగని భావము - దోఁచిన పయ్యెదయు
కాఁగిన దేహపు సెకలును - కప్పిన పువ్వుల సొరబులు(?)
వేఁగిన చెలి తాపమునకు - వెన్నెల మందెడిని. ॥పొద్దిక॥

3. దేవశిఖామణి తిరుమల - దేవునిఁ దలఁచినఁబాయక
భావించిన యీ కామిని - భావము లోపలను
ఆ విభుఁడే తానుండిఁక - నాతఁడె తానెఱఁగఁగవలె
నీ వెలఁదికిఁగల విరహంబేమని చెప్పుదము. ॥పొద్దిక॥

[XII–138]

# 12

[ఈ నాయిక ఎవరోగాని కడు గడుసరిది. జవ్వాదిమెత్తి తన యౌవనాన్నే కప్పంచేసి వేంకటప్ప కౌగిట కలసినది. ఈ పుత్తడి బొమ్మ ముద్దులమాటలు, గుత్తపుగుబ్బలు వేంకటరాయని చిత్తమునే కరిగించినవి. భగవంతునిలో ఐక్యమైన ఆ చెలి ఎంత అదృష్టవంతురాలు.]

* శంకరాభరణం

పల్లవి :

జవ్వాది మెత్తినది - అది తన
జవ్వనమే - ఉన్నెవట్టినది. ॥ జవ్వాది ॥

చరణములు :

1. ముద్దుల మాటలది - అది చెక్కు-
టద్దముల కాంతి నలరినది
గద్దరి చూపులది - అది తన
వొద్ది చెలియమీఁద - నొరగున్నది. ॥ జవ్వా ॥

2. పుత్తడిఁబోలినది - అది తన
చిత్తము ససొమ్ము - చేసినది
గుత్తపు గుబ్బలది - అది అల
చిత్తజుని లెక్క - సేయనిది. ॥ జవ్వా ॥

3. ఎమ్మెలు యెఱఁగనిది - అది తన
కెమ్మోవిఁ జిరునవ్వు - గెరలున్నది
కమ్మకొనఁగ - వెంకటరాయా నీ
కమ్మని కౌఁగిటఁ - గలశున్నది. ॥ జవ్వా ॥

[XII-316]

---

* చూడు– స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. మిశ్రచాపు తాళం నిర్దేశింపబడింది. తా. పా.
Vo. I పు. 14

# 13

[విరహపురాజునకు, విరహిణి అయిన ఈ తరుణి తన సహజ సింగారాలతో చక్కని విడిదినే ఏర్పాటుచేసింది. వలరాజు అలరి వనితను అనుగ్రహించినాడు. నాయికానాయకుల కలయి కకు అవకాశం ఏర్పడింది.]

సామంతం

పల్లవి :

విరహపు రాజదె - విడిదికి రాఁగా
సిరులఁజేసె నిదె - సింగారములూ. ॥ విర ॥

చరణములు :

1. నెలఁత నుదుటిపై - నీలపుఁగురులనె
తొలుతనె కట్టెను - దోరణము
మొలక చెమటలనె - ముత్యపు ముగ్గులు
అలరిచె మదనుం - డదె చెలిమేన. ॥ విర ॥

2. దట్టముగాఁ జింతా లతనే వడిఁ
బెట్టిఁజప్పరము - పెనఁగొనఁగ
పట్టిన మైతావులు - పరిమళములు
కట్టించెను చెం - గట వలరాజు. ॥ విర ॥

3. విందగు వేంకట - విభుని ప్రేమచేఁ
బొందగఁ బెట్టెను - బోనాలు
ఇందువదనకీ - యిందిరావిభుని
కెందుదేర నలు కలు చలి చేసె. ॥ విర ॥

[IV-71]

# 14

[ ఈ కోమలి తన కొంగులో ముడివేసుకొన్న ఒయ్యారాలను వలపులను విప్పి కుమ్మరించినది, ఆ భక్తురాలు సమర్పించిన ముడుపులను వేంకటేశ్వరుడు ఒడుపుతో స్వీకరించినాడు. ]

ఆహిరి

పల్లవి:

కొమ్మ తన ముత్యాల - కొంగు జారఁగఁబగటు
కుమ్మరింపుచుఁ దెచ్చు - కొన్నదీ వలపు. ॥ కొమ్మ ॥

చరణములు:

1. ఒయ్యారమున విభుని - వొరపుగనుఁగొని రెప్ప
ముయ్యనేరక మహా - మురిపెమునను
కయ్యంపుఁ గూటమికిఁ - గాలు దువ్వుచు నెంతె
కొయ్యతనమునఁ దెచ్చు - కొన్నదీ వలపు. ॥ కొమ్మ ॥

2. పైపైనె ఆరగింపకుము - పన్నీరు గడు
తాపమవునని చెలులు - దలఁకగానే
తోపుసేయుచుఁ గెంపు - దొలఁకుఁ గన్నులకొనల
కోపగింపుచుఁ దెచ్చు - కొన్నదీవలపు. ॥ కొమ్మ ॥

3. ఎప్పుడునుఁ బతితోడ - నింతేసి మేలములు
ఒప్పదని చెలిగోర - నొత్తఁగానే
యెప్పుడో తిరువేంక - టేశు కౌఁగిటఁగూడి
కొప్పుగులుకుచుఁ దెచ్చు - కొన్నదీవలపు. ॥ కొమ్మ ॥

[XII–74]

# 15

[యశోదముంగిట ముత్యమువలె తిరిగిన శిశువే చతుర్దశభువ
నాలను సృజించిన బ్రహ్మదేవుని తండ్రియై విరాజిల్లినాడు.
విశ్వమంతా వ్యాపించిన వేంకటేశ్వరుని ఒక్క ప్రణయంతోనే
సాధించ వచ్చును. శరణంటే చేరి రక్షించే దేవుడు శ్రీనివాసుడు.]

## శుద్ధవసంతం

పల్లవి :

చేరి యశోదకు - శిశువితఁడు
ధారుణి బ్రహ్మకుఁ - దండ్రియు నితఁడు. ॥ చేరి ॥

చరణములు :

1. సొలసి చూచినను - సూర్య చంద్రులను
లలి వెద చల్లెడు - లక్షణుడు
నిలిచిన నిలువున - నిఖిల దేవతల
కలిగించు సురల - గనివో యితఁడు. ॥ చేరి ॥

2. మాటలాడినను - మరి యజాండములు
కోటులు వొడమెటి - గుణరాశి
నీటగు నూర్పుల - నిఖిల వేదములు
చాటువ నూరెటి - సముద్ర మితఁడు. ॥ చేరి ॥

3. ముంగిటఁ బొలసిన - మోహన మాత్మలఁ
బొంగించే ఘన - పురుషుఁడు
సంగతి మావంటి - శరణాగతులకు
నంగము శ్రీ వేంకటా ధిపుఁ డితఁడు. ॥ చేరి ॥

[IX-196]

# 16

[ కృష్ణుని దుండగములు మితిమీరినవి. ఒక మగువ బాలుని కొట్ట బోయినది; మరొక గోపెమ్మ వారించినది. బాలుడా వాడు సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపుడు. ఈ పాటలో వస్తువిదే. ]

* కాంభోజి

పల్లవి :

మొత్తకురే అమ్మలాల - ముద్దులాఁడు వీఁడె
ముత్తెమువలె నున్నాఁడు - ముద్దులాఁడు. ॥ మొత్త ॥

చరణములు :

1. చక్కని యశోద తన్ను - సలిగతో మొత్తరాఁగా
మొక్కఁ బోయీఁ గాళ్ళకు - ముద్దులాఁడు
వెక్కసాన రేపల్లె - వెన్నలెల్లమాపుదాఁక
ముక్కున వయ్యఁగఁ దిన్న - ముద్దులాఁడు. ॥ మొత్త ॥

2. రువ్వెడి - రాళ్ళఁ [1]దల్లి - రోలఁ దన్నుఁ గట్టెనంట
మువ్వల గంటల తోడి - ముద్దులాఁడు
నవ్వెడిఁ - జెక్కుల నిండ - నమ్మిక బాలునివలె
మువ్వురిలో - నెక్కుడైన - ముద్దులాఁడు. ॥ మొత్త ॥

3. వేల సంఖ్యల సతుల - వెంటఁ బెట్టుకొనిరాఁగా
మూలఁజన్నుగుడిచీని - ముద్దులాఁడు
మేలిమి వెంకటగిరి - మీఁదనున్నాఁడిదె వచ్చి
మూలభూతి దానైన - ముద్దులాఁడు. ॥ మొత్త ॥

[IV-142]

---

* చూడు - స్వరకల్పన, రా. అ. కృ. శర్మ. తా. అ. పా. పు. 22

# 17

[బాలకృష్ణుడు ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డడు. శ్రీకృష్ణుని కొందరు ప్రణయంతో సాధిస్తే మరికొందరు పగతో సాధిస్తారు. బాలుని వలె తిరిగే యోగీశ్వరేశ్వరుడు కృష్ణుడు. రత్నాలగుణాలన్నీ ఈ రాజీవాక్షునిలో రాశీభూతమై నిలిచినవి.]

* సాళంగనాట

పల్లవి:

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీఁడు
తిద్దరాని మహిమల - దేవకీ సుతుఁడు. ॥ ముద్దు ॥

చరణములు:

1. అంత నింత గొల్లెతల - అరచేతి మాణికము
పంతమాడే కంసుని - పాలి వజ్రము
కాంతుల మూఁడు లోకాల - గరుడపచ్చఁబూస
చెంతల మాలోనున్న - చిన్నికృష్ణుడు. ॥ ముద్దు ॥

2. రతికేళి రుక్మిణికి - రంగు మోవి పగడము
మితి గోవర్ధనపు గో - మేధికము
సతమై శంఖ చక్రాల - సందుల వైడూర్యము
గతియై మమ్ముఁ - గాచేటి కమలాక్షుఁడు. ॥ ముద్దు ॥

3. కాళింగుని తలలపైఁ - గప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీ వేంకటాద్రి - యింద్రనీలము
పాలజలనిధిలోనఁ - బాయని దివ్యరత్నము
బాలునివలెఁ దిరిగీఁ - బద్మనాభుఁడు. ॥ ముద్దు ॥

[IX–288]

---

* చూడు — స్వరకల్పన. కురంజి రాగంలో నే. కృ. తా. అ. పా. పు. 133

# 18

[ బాలకృష్ణుని 'దొంగచేష్టలు' ముగ్ధసుందరంగ తెలిపేపాట. ]

దేవగాంధారి

పల్లవి :

ఇట్టి ముద్దులాఁడి బాలుఁ - డేడవాఁడు వానిఁ
బట్టి తెచ్చి పొట్టనిండఁ - బాలు వోయరే. ॥ ఇట్టి ॥

చరణములు :

1. గామిడై పారితెంచి - కాఁగెడి వెన్నలలోన
చేమపూవు కడియాల - చేయిపెట్టి
చీమ గుట్టెనని తన - చెక్కిటఁ గన్నీరు జార
వేమరు వాపోయే వాని - వెద్దు వెట్టరే ॥ ఇట్టి ॥

2. ముచ్చువలె వచ్చి తన - ముంగ మురువుల చేయి
తచ్చెడి పెరుగులోనఁ - దగఁబెట్టి
నొచ్చెనని చేయిదీసి - నోర నెల్లఁ జొల్లుగార
వొచ్చెలి వాపోవువాని - నూరడించరే. ॥ ఇట్టి ॥

3. ఎప్పుడు వచ్చెనో మా - యిల్లు చొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల - చేయిపెట్టి
అప్పఁడైన వేంకటాద్రి - అసవాలకుడుఁగాన
తప్పకుండ బెట్టెఁ(బట్టి) వాని తలకెత్తరే. ॥ ఇట్టి ॥

[XI-ష.173]

# 19

[తల్లి బిడ్డకు ఉగ్గుపోసే సన్నివేశం ప్రతిఇంటా కనిపించేదే. ఉగ్గుపెట్టే విధానం మన కృష్ణయ్య విషయంలో ఒక కమ్మని పాటగా సాగింది.]

*భైరవి

పల్లవి :

ఉగ్గువెట్టరే - వోయమ్మా చె
య్యొగ్గినిదె శిశు - వోయమ్మా ॥ ఉగ్గు ॥

చరణములు :

1. కడుపులోని లో - కమ్ములుఁ గదలీ
నొడలూఁచకురే - వోయమ్మా
తొడికెడి సరుగనఁ - దొలఁగఁదీయరే
వుడికెడిపాలివి - వోయమ్మా ॥ ఉగ్గు ॥

2. చప్పలు వట్టుక - సన్నపు బాలుని
నుప్పర మెత్తకు - రోయమ్మా
అప్పుడె సకలము - నదిమీనోరనె
వొప్పదు తియ్యరె - వోయమ్మా ॥ ఉగ్గు ॥

3. తొయ్యలు లిటు చేతుల నలఁగించక
పుయ్యల నిడరే - వోయమ్మా
కొయ్యమాటలను - కొండల తిమ్మని
నొయ్యన తిట్టకు -రోరమ్మా ॥ ఉగ్గు ॥

[XII-97]

---

* చూడు - స్వరకల్పన. కమాన్ రాగంలో నే. కృ. తా. అ. పా. పు. 129

# 20

[బాలకృష్ణుని స్వైరవిహారం గోకులమంతా ప్రతిబింబించింది. అందరికీ ఆస్వాదయోగ్యమైన నవనీతాన్ని ఏ కొందరికో అందే టట్లు ఉట్లమీద పెట్టడం భావ్యం కాదనుకొన్న బాలయోగి కృష్ణుడు ఆ పరమామృతాన్ని అందరికీ పంచిపెట్టినాడు. ఈ అమృత రహస్యాన్ని భేదించి అన్నమయ్య మనందరికీ పంచి యిచ్చినాడు.]

ముఖారి

పల్లవి :

పలుమరు వుట్ల - పండుగను
చిలుకు చిడుక్కని - చిందగను

చరణములు :

1. ఊళ్లవీధుల - వుట్లు కృష్ణుఁడు
తాళ్లు దెగిపడఁ - దన్నుచును (న్నఁగను?)
పెళ్లు కరిల్లు - పెరిల్లని
పెల్లగ మ్రోసె - పెనురవము ॥ పలు ॥

2. బంగా(గ)రు బిందెలఁ - బాలుఁబెరుగులు
ముంగిట నెగయుచు - మోఁదఁగను
కంగు కళింగు - కళింగు ఖణింగని
రంగు మీరు పెను - రవములై ॥ పలు ॥

3. బిగ్గుగ వేంకట - నిలయుఁడుట్టిపా
లగ్గలికఁబగుల - నడువఁగను
భగ్గు భగిల్లని - పరమామృతములు
గుగ్గిలి పదనుగఁ - గురియఁగను ॥ పలు ॥

[XII–57]

# 21

[ గోపికల పాటలకు గోకులమంతా ఘుమ్మన్నది. శాసనకు-నాదానికి ఒక్కటే శ్రుతి. వేదనిలయుడైన వేంకటపతి తత్త్వాన్ని సూక్ష్మంగ వివరించే సంకీర్తన ఇది ]

## పాడి

పల్లవి :

ఘుమ్మని యెడి శృతిఁ - గూడఁగను
కమ్మని నేతులు - కాఁగఁగఁజెలఁగె ॥ ఘుమ్మని ॥

చరణములు :

1. నీలవర్ణుడని - నీరజాక్షుఁడని
బాలుని నతివలు - పాడేరో
పాలుపిదుకుచును - బానల కాఁగుల
సోలిపెరుగు ద్రచ్చుచుఁజెలరేఁగి ॥ ఘుమ్మని ॥

2. మందరధరుఁడని - మాధవుఁడని గో
విందునిఁబాడేరు - వెలఁదులిదే
నందవ్రజమున - నలుగడనావుల
మందలఁబేయల - మంచిరవములు ॥ ఘుమ్మని ॥

3. వెంకటపతియని - వేదనిలయుఁడని
పంకజనాభునిఁ - బాడేరు
అంకుల చేతను - నలరు రవంబుల
బింకపు మాటల - బృందావనమున ॥ ఘుమ్మని ॥

[IV-81]

# 22

[బాలకృష్ణుని పసిడి ఉయ్యాలలో ఉంచి వ్రజభామలు లాలిపాటలు పాడినారు. ఉయ్యాల ఆరోహణ అవరోహణ క్రమాలతో సాగింది. పాట ఉయ్యాలవలె; ఉయ్యాల పాటవలె నడిచింది.]

* శంకరాభరణం

పల్లవి :

ఉయ్యాలా బాలునూఁచెదరు కడు
నొయ్య నొయ్య నొయ్యనుచు ॥ ఉయ్యా ॥

చరణములు :

1. బాలయవ్వనలు పసిడివుయ్యాల
బాలుని వద్ద పాడేరు -
లాలి లాలి లాలి లాలెమ్మ
లాలి లాలి లాలి లాలనుచు ॥ ఉయ్యా ॥

2. తమ్మిరేకుఁ గనుఁ - దమ్ముల నవ్వుల
పమ్ముఁ జూపులఁ - బాడేరు
కొమ్మలు మట్టెల గునుకుల నడపుల
ధిమ్మి ధిమ్మి ధిమ్మి ధిమ్మనుచు ॥ ఉయ్యా ॥

3. చల్లుఁ జూపుల - జవరాండ్లురే
పల్లె బాలునిఁ - బాడేరు
బల్లిదు వేంకటపతిఁ జేరి యందెలు
ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లనుచు ॥ ఉయ్యా ॥

[XII–245]

---

* చూడు – స్వరకల్పన. మధ్యమావతి రాగంలో నే. కృ. ఆదితాళం నిర్దేశింపబడింది.
తా. అ. పా. పు. 126

# 23

[అన్నమయ్య హృదయగతమైన శరణాగతితత్త్వమే ఈ పాటలో ప్రతిబింబిస్తున్నది. అన్నమయ్య జీవితమే ఒక దీర్ఘ శరణాగతి. ఈ వైష్ణవభక్తుడు తనహృదయ కిన్నెరను మీటుతూ పాడిన పాట ఇది.]

*శుద్ధవసంతం

పల్లవి :

దీనుఁడ నేను - దేవుఁడవు నీవు
నీ నిజ మహిమే - నెరపుట గాక. ॥ దీనుడ ॥

చరణములు :

1. మతి జనన మెరుఁగ - మరణం బెరుఁగను
ఇతవుగ నినునిఁక - నెరిగేనా
క్షితిఁబుట్టించిన - శ్రీపతివినీవే
తతి నాపై దయ - దలఁతువు గాక. ॥ దీనుడ ॥

2. తలఁచఁ బాపమని - తలఁచఁ బుణ్యమని
తలఁపున ఇఁక నినుఁ దలఁచేనా
అలరిన నాలో - అంతర్యామివి
కలుష మెడయ నను గాతువుగాక. ॥ దీనుడ ॥

3. తడవ నా హేయము - తడవ నా మలినము
తడయక నీ మేలుఁ - దడవేనా
విడువలేని శ్రీ - వేంకట విభుఁడవు
కడదాఁక నిఁకఁ - గాతువుగాక. ॥ దీనుడ ॥

[IX-185]

* చూడు — స్వరకల్పన. నీలాంబరి రాగంలో. వే. కృ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. పు. 112

# 24

[లౌకిక జీవితం సత్యంకాదు. అదినాటకం. అలౌకికమైన పరత త్త్వాన్ని సాధించడమే కైవల్యం. అది సత్యం. దిగువ మనము సాధించేది ఏమీలేదు. సాధించేది, సాధించవలసింది ఎగువనే. అక్కడ ప్రభువు వేంకటేశ్వరుడు. అన్నమయ్య తాను నమ్మి నడచిన దారినే మనకు చూపుతున్నాడు.]

* ముఖారి

పల్లవి:

నానాటి బదుకు - నాటకము
కానక కన్నది - కైవల్యము ॥ నానాటి ॥

చరణములు:

1. పుట్టుటయు నిజము - పోవుటయు నిజము
నట్టనడిమి పని - నాటకము
యెట్ట నెదుటఁగల - దీప్రపంచము
కట్టఁగడపటిది - కైవల్యము.

2. కుడిచే దన్నము - కోకచుట్టెడిది
నడు మంత్రపు పని - నాటకము
వొడి గట్టుకొనిన - వుభయకర్మములు
గడి దాఁటినపుడె - కైవల్యము. ॥ నానాటి ॥

3. తెగదు పాపము - తీరదు పుణ్యము
నగినగికాలము - నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరుఁ డేలిక
గగనము మీఁదిది - కైవల్యము. ॥ నానాటి ॥

[IX-287]

* చూడు – స్వరకల్పన. రేవతి రాగంలో. నే. కృ. ఆదితాళం నిర్దేశించబడింది.
రా. అ. పా. 117

# 25

[ ఇది అన్నమయ్య సాళ్వనరసింగని చెరలో పడినప్పుడు పాడిన పాటఅని పెద్దలభావన. ఆపదుద్ధారకమైన హరినామమహిమను తెలిపే పదమిది ]

* ముఖారి

పల్లవి :

ఆఁకటివేళల - అలపైన వేళలను
తేఁకువ హరినామమె - దిక్కు మరిలేదు. ॥ ఆకటి ॥

చరణములు :

1. కొఱమాలి యున్నవేళ - కులము చెడినవేళ
చెఱవడి యొరులచే - చిక్కినవేళ
ఒఱపైన హరినామ - మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన - మరిలేదు తెరఁగు. ॥ ఆకటి ॥

2. ఆపద వచ్చినవేళ - ఆరడిఁ బడినవేళ
పాపపువేళల భయ - పడినవేళ
ఓపినంత హరినామ - మొక్కటేగతిగాక
మాపుదాఁకా పొరలిన - మరిలేదు తెరఁగు. ॥ ఆకటి ॥

3. సంకెళఁ బెట్టినవేళ - చంప బిలిచినవేళ
అంకిలిగా నప్పులవా - రాఁగినవేళ
వెంకటేశు నామమే - విడిపించ గతిగాక
మంకుబుద్ధిఁ బొరలిన - మరిలేదు తెరఁగు.

[V–100]

* మాడు – స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. రూపకతాళం నిర్దేశింపబడింది.
తా. అ. పా. పు. 76

# 26

[ఇది అన్నమయ్య మానసబోధ. గోవిందుని త్రికరణశుద్ధితో సేవించుమని ఆత్మను ప్రబోధించడం ఇందలి విషయం.]

* దేసాక్షి

పల్లవి :

భావములోనా - బాహ్యమునందును
గోవింద గోవిందయని - కొలువవో మనసా ॥ భావ ॥

చరణములు :

1. హరి యవతారములే - యఖిలదేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే - అన్ని మంత్రములు
హరి హరి హరి హరి యనవో మనసా ॥ భావ ॥

2. విష్ణుని మహిమలే - విహిత కర్మములు
విష్ణుని పొగడెడి - వేదంబులు
విష్ణుడొక్కడే - విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని - వెదకవో మనసా ॥ భావ ॥

3. అచ్యుతుడితడే - ఆదియునంత్యము
అచ్యుతుడే - యసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీదనిదె
అచ్యుత యచ్యుత శరణనవో మనసా ॥ భావ ॥

[XI–272]

* చూడు – స్వరకల్పన–శుద్ధధన్యాసిరాగం. వే.కృ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా.అ.పా. 143

# 27

[ నాదప్రియుడు,నారదసన్నుతుడైన వేంకటనాయకుని స్తుతించే ఈ పాట హరిభజన సంప్రదాయంలో ప్రసిద్ధంగ నేటికి నిలచిఉంది ]

*పాడి

పల్లవి :

నారాయణ తే - నమో నమో
నారద సన్నుత - నమో నమో. ॥నారా॥

చరణములు :

1. మురహర భవహర - ముకుంద మాధవ
గరుడ గమన పం - కజనాభ
పరమపురుష భవబంధ విమోచన
నరమృగశరీర - నమో నమో. ॥నారా॥

2. జలధిశయన రవి - చంద్రవిలోచన
జలరుహభవనుత - చరణయుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే - నమో నమో. ॥నారా॥

3. ఆదిదేవ సక - లాగమపూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీ - వేంకటనాయక
నాదప్రియ తే - నమోనమో. ॥నారా॥

[XI. పు. 17]

# 28

[ఏనాడు వాల్మీకి కరుణరసహృదయం కరగి రామాయణ కావ్య లహరిగా ప్రవహించిందో ఆనాటినుండి మానవజాతి రామకథా శ్రవణానంద కందళిత హృదయారవిందాలతో పునీతమైంది. రాముడు లోకాభిరాముడు. ఇతడు ఎంత ప్రతివీరభయంకరుడో అంత నిజభక్త పారీణుడు. రాముని శౌర్యగుణ పరాక్రమాలను కీర్తించే సంకీర్తన.]

* గుండక్రియ

పల్లవి :

జయ జయరామా - సమరవిజయరామా
భయ హర నిజభక్త - పారీణరామా ॥ జయ ॥

చరణములు :

1. జలధి బంధించిన - సౌమిత్రి రామా
నెలవిల్లు విరచిన - సీతారామా
అల సుగ్రీవు నేలిన - అయోధ్యరామా
కలిగి యజ్ఞముగాచే - కౌసల్యరామా ॥ జయ ॥

2. అరి రావణాంతక - ఆదిత్యకులరామా
గురు మౌనులనుగాచే - కోదండరామా
ధర నహల్యపాలిటి దశరథ రామా
హరురాణి నుతుల లో - కాభిరామా ॥ జయ ॥

3. అతి ప్రతాపముల మాయామృగాంతకరామా
సుతకుశలవప్రియ - సుగుణరామా
వితత మహిమల శ్రీ - వెంకటాద్రిరామా
మతిలోనఁ బాయని - మనువంశరామా ॥ జయ ॥

[IX–11]

* చూడు — స్వరకల్పన మణిరంగురాగంలో - నే. కృ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా.అ.పా. 108

# 29

[ అన్నమయ్య వేంకటపతికి చేసిన విన్నపము. భజన పద్ధతిలో సాగే ఈ అన్నమాచార్య కీర్తన ప్రసిద్ధమైనది. ]

## మాళవి

పల్లవి:

శరణు శరణు సురేంద్ర సన్నుత - శరణు శ్రీసతివల్లభా
శరణు రాక్షసగర్వ సంహార - శరణు వెంకటనాయకా ॥ శర ॥

చరణము:

1. కమలధరుఁడును కమలమిత్రుఁడు - కమలశత్రుడు పుత్రుఁడు
క్రమముతో మీకొలువు కిప్పుడు - కాచినా రెచ్చరికయా. ॥ శర ॥

2. అనిమిషేంద్రులు మునులు దిక్పతు - లమర కిన్నర సిద్ధులు
ఘనతతో రంభాదికాంతలు - కాచినా రెచ్చరికయా. ॥ శర ॥

3. ఎన్నఁగల ప్రహ్లాద ముఖ్యులు - నిన్నుఁగొలువఁగ వచ్చిరీ
విన్నపము వినవయ్య తిరుపతి - వేంకటాచలనాయకా. ॥ శర ॥

[అన్నమాచార్య చరిత్ర పీఠిక. పు. 67]

# 30

[శ్రీరామచంద్రుని శౌర్య సౌందర్యాలను కీర్తించే పాట ఇది.]

ధన్నాసి

పల్లవి :

దేవదేవం భజే - దివ్యప్రభావం
రావణాసురవైరి - రణపుంగవం. ॥ దేవ ॥

చరణములు :

1. రాజవరశేఖరం - రవికులసుధాకరం
ఆజానుబాహు నీలాభ్రకాయం
రాజారి కోదండ - రాజ దీక్షాగురుం
రాజీవలోచనం - రామచంద్రం. ॥ దేవ ॥

2. నీలజీమూత సన్నిభశరీరం ఘనవి
శాలవక్షం విమల జలజనాభం
తాలాహినగహరం - ధర్మసంస్థాపనం
భూలలనాధిపం - భోగిశయనం. ॥ దేవ ॥

3. పంకజాసన వినుత - పరమనారాయణం
శంకరార్జిత జనక చాపదళనం
లంకా విశోషణం - లాలితవిభీషణం
వెంకటేశం సాధు - విబుధ వినుతం. ॥ దేవ ॥

[XI—285]

# 31

[ అన్నమయ్య కన్న కలలన్నీ పదకవితలైనవి. ప్రతి పదమూ ఒక కళాఖండమే. శేషగిరిశిఖరాలలో నిలిచిన వేలుపు ఈ భక్తుని పిలిచినట్లైనది. స్వామి కలలో కనిపించిన తర్వాత అన్నమయ్య వ్రాసిన పాట ఇది అని ఆప్తవాక్యం. ]

*భూపాళం

పల్లవి :

ఇప్పుడిటు కలగంటి - నెల్లలోకములకు
అప్పఁడగు తిరువేంక - టాద్రీశుఁ గంటి ॥ ఇప్పు ॥

చరణములు :

1. అతిశయంబైనశే - షాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపుర - ప్రభలు గంటి
శతకోటి సూర్యతే - జములు వెలుఁగఁగఁగంటి
చతురాస్యుఁ బొడగంటి - చయ్యన మేల్కంటి ॥ ఇప్పు ॥

2. కనకరత్నకవాట - కాంతు లిరుగడఁగంటి
ఘనమైన దీపసం - ఘములు గంటి
అనుపమ మణీమయ - మ్మగుకిరీటము గంటి
కనకాంబరము గంటి - గ్రక్కన మెల్కంటి ॥ ఇప్పు ॥

3. అరుదైన శంఖచక్రాదు లిరుగడఁగంటి
సరిలేని యభయ హస్తము గంటిని
తిరువేంకటాచలా - ధిపుని జూడఁగఁగంటి
హరిఁ గంటి గురుఁగంటి - నంతట మేల్కంటి ॥ ఇప్పు ॥

[V–38]

* చూడు — స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. బంపెరాళం నిర్దేశింపబడింది. తా. పా. పు. 10.

# 32

[వేంకటగిరి ప్రభువు అర్చావతారం ఇందు వర్ణింపబడినది. పాటిలేని ఈ వేల్పు కటివరద హస్తాలను భక్తుడు ప్రత్యేకంగ పేర్కొన్నాడు.]

* శ్రీరాగం

పల్లవి:

చేరి కొల్వరో యీతఁడు శ్రీదేవుఁడు
యీ రీతి శ్రీ వెంకటాద్రి - నిరవైన దేవుఁడు. ॥ చేరి ॥

చరణములు:

1. అలమేలుమంగ నురమం దిడుకొన్న దేవుఁడు
చెలఁగి శంఖ చక్రాల - చేతిదేవుఁడు
కల వరద హస్తముఁ - గటిహస్తపుదేవుఁడు
మలసీ శ్రీవత్స వనమాలికల దేవుఁడు. ॥ చేరి ॥

2. ఘన మకర కుండల - కర్ణములదేవుఁడు
కనక పీతాంబర శృంగార దేవుఁడు
నిచి బ్రహ్మాదుల - నాభి గన్న దేవుఁడు
జనించెఁ బాదాల గంగ - సంగతైనదేవుఁడు. ॥ చేరి ॥

3. కోటి మన్మథాకార సం - కులమైనదేవుఁడు
జూటపుఁ గిరీటపు మిం - చుల దేవుఁడు
వాటపు సొమ్ముల తోడి - వసుధాపతిదేవుఁడు
యీటులేని శ్రీ వేంకటేశుఁడైన దేవుఁడు. ॥ చేరి ॥

[XI-1]

---

* చూడు — స్వరకల్పన. నే. కృ. మిశ్రచాపు తాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. పు. 93

# 33

[భక్తి నిండి నిబిడీకృతమైనప్పుడు భావం పరువళ్లుత్రొక్కుతుంది. భక్తజనపారిజాతమైన వేంకటవిభుని మహిమలు అగణితములు. మాకు నిధి, నిధానము నీవే అని కోనేటిరాయని ఈ భక్తుడు స్తుతిస్తున్నాడు.]

### * శంకరాభరణం — అట్టతాళం

పల్లవి :

పొడగంటిమయ్య మిమ్ము - పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్య కోనేటి రాయఁడా. ॥ పొడ ॥

చరణములు :

1. కోరిమమ్ము నేలినట్టి - కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన - నిధానమా
గారవించి దప్పిదీర్చు - కాలమేఘమా, మాకు
చేరువఁజిత్తములోని - శ్రీనివాసుఁడా. ॥ పొడ ॥

2. భావింపఁ గైవసమైన - పారిజాతమా, మమ్ము
చేవదేరఁ గాచినట్టి - చింతామణీ
కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి - ధరణీధరా. ॥ పొడ ॥

3. చెడనీక బ్రతికించే - సిద్ధమంత్రమా, రోగా
లడఁచి రక్షించే దివ్యౌషధమా
బడిఁబాయక తిరిగే - ప్రాణబంధుఁడా, మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకటనాథుఁడా. ॥ పొడ ॥

[అన్న. చరిత్ర. పీఠిక. పు. 21]

* చూడు — స్వరకల్పన. రా. అ. కృ. శర్మ, తాళం అందే నిర్దేశింపబడింది. తా. పా. Vo. 1 పు. 6

# 34

[ వేంకటేశ్వరుని తత్త్వం సంసారమోహంలో చిక్కుకున్న వారికి తెలియదు. సత్యవ్రతులు, ధీరులు, యోగులు అయిన వాళ్ళకే అది సాధ్యం. ]

* శ్రీరాగం

పల్లవి:

ఇతరులకు నిను - నెఱుఁగఁదరమా. ॥ ఇత ॥

అను పల్లవి:

సతత సత్యవ్రతులు - సంపూర్ణమోహ విర
హితు లెఱుంగుదురు నిను - నిందిరారమణా. ॥ ఇత ॥

చరణములు:

1. నారీకటాక్ష పటు - నారాచ భయరహిత
శూరు లెఱుఁగుదురు నినుఁ - జూచేటి చూపు
ఘోర సంసార సం - కుల పరిచ్ఛేదులగు
ధీరు లెఱుఁగుదుఱు నీ - దివ్యవిగ్రహము. ॥ ఇత ॥

2. రాగభోగవిదూర - రంజితాత్ములు మహా
భాగు లెఱుఁగుదురు నినుఁ - బ్రణుతించు విధము
ఆగమోక్తప్రకారాభిగమ్యులు మహా
యోగు లెఱుఁగుదురు నీ - వుండేటి వునికి. ॥ ఇత ॥

3. పరమ భాగవత పద - పద్మసేవా నిజా
భరణు లెఱుఁగుదురు నీ - పలికేటిపలుకు
పరఁగు నిత్యానంద - పరిపూర్ణ మానస
స్థిరు లెఱుంగుదురు నిను - తిరువేంకటేశ. ॥ ఇత ॥

[V-155]

---

* చూడు – స్వరకల్పన రా. అ. కృ. శర్మ. బంపెతాళం నిర్దేశింపబడింది.
రా. ప్ర. Vo. I పు. 152

# 35

[ భగవంతుని విశ్వరూపం వర్ణింపబడింది. సూర్యచంద్రులు అతనికి రెండు కన్నులు. వేంకటేశ్వరుడు ఆకాశమువలె ఉన్నాడని ధ్వని. సకల చరాచరసృష్టి అతని ఆకారమునకు పెట్టని భూషణమై తనరారినది. ]

*వరాళి

పల్లవి :

చూడఁ జూడ మాణిక్యాలు - చుక్కలవలె నున్నవి

అనుపల్లవి :

ఈడులేని కన్నులవే - యినచంద్రులు. ॥ చూడ ॥

చరణములు :

1. కంటిఁ గంటి వాఁడె వాఁడె - ఘనమైన ముత్యాల
కంటమాలలవే పద - కములు నవే
మింటి పొడవైనట్టి - మించుకిరీటంబదె
జంటల వెలుగు శంఖ - చక్రాలవే. ॥ చూడ ॥

2. మొక్కు మొక్కు వాఁడె - ఘనమైన ముత్యాల
చెక్కులవే నగవుతో - జిగి మోమదే
పుక్కిట లోకములవే - భుజకీర్తులును నవే
చక్కనమ్మ అలమేలు - జీవరాలదే. ॥ చూడ ॥

3. ముంగై మురాలును నవే - మొలకతారును నదే
బంగరు నిగ్గుల వన్నె - పచ్చబట్టదే
ఇంగిత మెఱిఁగి వేంక - టేశుఁడిదే కన్నులకు
ముంగిటి నిధానమైన - మూలభూతమదే. ॥ చూడ ॥

[V–75]

* చూడు— స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. రూపకతాళం నిర్దేశింపబడింది. తా.పా. II. పు. 193

# 36

[ తిరుమల స్వామికి ప్రతి శుక్రవారం అభిషేకం. వేంకటేశ్వరుని తిరుమజ్జనోత్సవం నేత్రపర్వంగ వర్ణింపబడినది. ]

పల్లవి :

కంటి శుక్రవారము - గడియ లేడింట
అంటి అలమేల్మంగ - అండనుండేస్వామిని. ॥ కంటి ॥

చరణములు :

1. సొమ్ములన్ని కడఁబెట్టి - సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబము - కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు - రొమ్ముతల మొల చుట్టి
తుమ్మెద మైచాయతోన - నెమ్మది నుండే స్వామిని. ॥ కంటి ॥

2. పచ్చ కప్పురమె నూఱి - పసిడి గిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ - దిగనలఁది
అచ్చెర పడి చూడ - అందరి కన్నుల కింపై
నిచ్చమల్లె పూవువలె - నిటు తానుండేస్వామిని. ॥ కంటి ॥

3. తట్టు పునుఁగె కూరిచి - చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరఁగించి వెండి - పళ్యాల నించి
దట్టముగ మేనునిండ - పట్టించి దిద్ది .
బిట్టు వేడుక మురియుచుండే - బిత్తరి స్వామిని. ॥ కంటి ॥

[అన్నమాచార్యుల జీవిత చరిత్ర పీఠిక. పు. 39]

---

* చూడు — స్వరకల్పన — నే. కృ. ఆనందభైరవిరాగంలో ఆదితాళం నిర్దేశింపబడింది.
తా. అ. పా. పు. 103

# 37

[పరమపదమైన శ్రీనివాసుని శ్రీపాదమును బహుధా ఉల్లేఖించు పాట ఇది.]

* ముఖారి

పల్లవి :

బ్రహ్మ గడిగిన - పాదము
బ్రహ్మము తానెనీ - పాదము. ॥ బ్రహ్మ ॥

చరణములు :

1. చెలఁగి వసుధఁ - గొలిచిన దీపాదము
బలి తల మోపిన - పాదము
తలఁకక గగనము - తన్నిన పాదము
బలరిపుఁ గాచిన - పాదము. ॥ బ్రహ్మ ॥

2. కామిని పాపము - కడిగిన పాదము
పాముతల నిడిన పాదము
ప్రేమపు శ్రీసతి - పిసికెడి పాదము
పామిడి తురగపు - పాదము. ॥ బ్రహ్మ ॥

3. పరమ యోగులకు - పరిపరి విధముల
పర మొసఁగెడి నీ - పాదము
తిరు వేంకటగిరి - తిరమని చూపిన
పరమ పదము నీ - పాదము. ॥ బ్రహ్మ ॥

[XI–పు. 259]

---

* చూడు – స్వరకల్పన. రా. అ. కృ. శర్మ ఆదితాళం నిర్దేశింపబడింది. తా అ. పా. పు. 39

# 38

[ వేంకటేశ్వరుని వరదహస్తమును ప్రశంసిస్తూ హరిదశావ తారాలను ప్రస్తుతించిన పాట ఇది. ]

సామంతం

పల్లవి :

ఇందరికి నభయంబు - లిచ్చుఁజేయి
కందువగు మంచి బంగారు చేయి. ॥ ఇంద ॥

చరణములు :

1. వెలలేని వేదములు - వెదకి తెచ్చిన చేయి
చిలుకుగుబ్బలికిందఁ - జేర్చుచేయి
కలికియగు భూకాంతఁ - గాఁ(గౌ?)గిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ - వాఁడిచేయి. ॥ ఇంద ॥

2. తనివోక బలిచేత - దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన - మొసఁగు చేయి
మొనసి జలనిధి యమ్ము - మొనకుఁ దెచ్చిన చేయి
యెనయ నాగేలు ధరి - యించు చేయి. ॥ ఇంద ॥

3. పురసతుల మానములు - పొల్లసేసిన చేయి
తురగంబుఁబరపెడి - దొడ్డచేయి
తిరువేంకటాచలా - ధీశుఁడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్లఁ - దెలిపెడి చేయి. ॥ ఇంద ॥

[XI–298]

# 39

[అనంతజలాలలో వటపత్రశాయిగా ఉన్నవిష్ణువే ధర్మసంస్థాపనార్థం యుగయుగాలలో అవతరించినాడు. భగవంతుని దశావతారాలను తెలిపే పదమిది.]

*లలిత

పల్లవి:

తెప్పగా మఱ్ఱాకు మీఁద - తేలాడువాఁడు
ఎప్పుడు లోకములెల్ల - నేలేటి వాడు. ॥ తెప్ప ॥

చరణములు:

1. మోత నీటి మడుగులో - ఈఁతగఱచినవాఁడు
పాఁతగిలే నూతిక్రిందఁ - బాయనివాఁడు
పూతఁ దోసిపట్టి మంటి - మూద్ద పెల్లగించువాఁడు
రోతయైన పేగుల పేరులు గలవాఁడు. ॥ తెప్ప ॥

2. కోడికూఁత నోరి వాని - కుఱ్ఱ తమ్ముఁడైనవాఁడు
బూడిదిఁ బూసినవాని - బుద్ధులవాఁడు
మాడవన్నె లేడివెంట - మాయలఁబడినవాఁడు
దూడల నావులఁగాచి - దొరయైనవాఁడు. ॥ తెప్ప ॥

3. ఆకసానఁ బారే వూరి - అతివల మానముల
కాకుసేయు వాఁడు తుర - గముపై వాఁడు
ఏకమై వెంకటగిరి - నిందిరారమణిఁ గూడి
యే కాలముఁ బాయని - యెనలేని వాఁడు. ॥ తెప్ప ॥

[III–161]

* చూడు – స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. రూపకతాళం నిర్దేశింపబడింది. రా. అ పా. పు 32

# 40

[ఇది అన్నమాచార్యులకు శ్రీ వైష్ణవదీక్షను అనుగ్రహించిన శ్రీ ఆదివణ్ శఠకోప యతీంద్రులను స్తుతించే సంకీర్తన. అహోబిల మఠమును స్థాపించిన మూలపురుషులు వీరే.]

*భైరవి

పల్లవి :

చూడు(డిందరికి - సులభు(డు హరి
తోడునీడయగు - దొరముని యిత(డు. ॥ చూడు ॥

చరణములు :

1. కైవల్యమునకు( - గనకపు తాపల
త్రోవై శ్రుతులకు( - దుదిపదమై
పావన మొక రూ - పంబై విరజకు
నావై భువిను - న్నా(డిదె యిత(డు. ॥ చూడు ॥

2. కాపాడ(గ లో - కములకు సుజ్ఞాన
దీపంబై జగ - తికి( దొడవై
పాపాలడ(ప(గ - భవపయోధులకు
తేపై జగములు( - దిరిగీ నిత(డు. ॥ చూడు ॥

3. కరుణానిధి రం - గపతికి( గాంచీ
వరునకు వేంకట - గిరి పతికి
నిరతి నహోబల - నృకేసరికి(త
త్పరు(డగు శఠకోపముని యిత(డు. ॥ చూడు ॥

[XI–పు522]

* చూడు – స్వరకల్పన. రా. ల. కృ. శర్మ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా. పా. Vol. II పు. 2

# 41

[భవరోగాలను దూరంచేసే మందుగానిమందు వేంకటశైలపతి. పరంపరగ పరమభాగవతులందరు ఈ మందునే సేవించి తరించినారు. కరుణకు, అనుగ్రహానికి పెట్టినదిపేరుగ వేంకటపతి ధ్వజమెత్తి చాటినారు.]

*శంకరాభరణం

పల్లవి:

కొనరో కొనరో మీరు - కూరిమి మందు
ఉనికి మనికికెల్ల - నొక్కటే మందు. ॥ కొనరో ॥

చరణములు:

1. ధ్రువుఁడు గొనిన మందు - తొల్లి ప్రహ్లాదుఁడు
చవిగాఁగొనిన మందు - చల్లని మందు
భవరోగములు వీడి - పారఁగఁ బెద్దలు మున్ను
జవకట్టుకొనిన ని - శ్చలమైన మందు. ॥ కొనరో ॥

2. నిలిచి నారదుఁడు గొ - నినమందు జనకుఁడు
గెలుపుతోఁగొని బ్రది - కిన యామందు
మొలచి నాలుగు యుగ - ములరాజులు ఘనులు
కలకాలముగొని - కడగన్నమందు. ॥ కొనరో ॥

3. అజునకుఁ బరమాయు - వై యొసగిన మందు
నిజమైలోకములెల్ల - నిండిన మందు
త్రిజగములు నెఱుఁగ - తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తెఁ గోనేటి - దరినున్నమందు. ॥ కొనరో ॥

[V-140]

* చూడు-స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. మిశ్రచాపుతాళం నిర్దేశింపబడింది.
తా. పా. Vol. II పు. 134

# 42

[ ఇది అహోబిల నృసింహుని కీర్తించే పాట. అహోబిలమున, వేంకటాచలమున పరమ దయాళుమూర్తిగా నిలిచిన సింహము. తాను చూచిన మగసింహమును అన్నమయ్య మనకు చూపుతున్నాడు. ]

శంకరాభరణం

పల్లవి :

మలసీఁ జూడరో - మగసింహము
అలవి మీరిన - మాయల సింహము. ॥ మలసీ ॥

చరణములు :

1. అదివో చూడరో - ఆదిమ పురుషుని
పెద యౌబళము మీఁది - పెనుసింహము
వెదకి బ్రహ్మాదులు - వేదాంత తతులు
కదిసి కానఁగ లేని - ఘన సింహము. ॥ మలసీ ॥

2. మెచ్చి మెచ్చి చూడరో - మితిమీఱిన యట్టి
చిచ్చఱకంటి తోడి - జిగి సింహము
తచ్చిన వారిధిలోని - తరుణిఁ గౌఁగిటఁజేర్చి
నచ్చిన గోళ్ళ(శ్రీ) - నరసింహము. ॥ మలసీ ॥

3. బింకమునఁ జూడరో - పిరితీయక నేడు
అంకపుదనుజ సం - హార సింహము
వెంకట నగముపై - వేదాచలముపై
కింక లేక వడిఁబెరి - గిన సింహము. ॥ మలసీ ॥

[V-13]

* చూడు — స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. రూపకతాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. పు. 46

# 43

[భగవంతుడు భక్తసులభుడు. మనము ఎంత తీవ్రముగ భక్తి చూపుదుమో అంత తొందరగ ప్రసన్నుడగుచుండును. ఇహ పరసుఖాల నిచ్చేవాడు పరమాత్ముడే. ఈ సత్యమే ఇందు ప్రపంచింపబడినది.]

రామక్రియ

పల్లవి :

భక్తి కొలఁది వాఁడే - పరమాత్ముఁడు
భుక్తి ముక్తిఁ దానె యిచ్చు - భువి పరమాత్ముడు. ॥భక్తి॥

చరణములు :

1. పట్టినవారి చేబిడ్డ - పరమాత్ముఁడు
బట్టబయటి ధనము - పరమాత్ముఁడు
పట్టపగటి వెలుఁగు - పరమాత్ముఁడు
ఎట్ట యెదుటనే వున్నాఁ - డిదే పరమాత్ముఁడు. ॥భక్తి॥

2. పచ్చిపాలలోని వెన్న - పరమాత్ముఁడు
బచ్చెన వాసిన రూపు - పరమాత్ముఁడు
బచ్చుచేతివొరగల్లు - పరమాత్ముఁడు
ఇచ్చకొలఁదివాడుపో - యీ పరమాత్ముఁడు. ॥భక్తి॥

3. పలుకులలోని తేఁట - పరమాత్ముఁడు
ఫలియించు నిందరికి - పరమాత్ముఁడు
బలిమి శ్రీవేంకటాద్రి - పరమాత్ముఁడు
ఎలమి జీవుల ప్రాణ - మీ పరమాత్ముఁడు. ॥భక్తి॥

[V-235]

* చూడు – స్వరకల్పన. రా.అ.కృ. శర్మ రూపకతాళం నిర్దేశింపబడింది. తా.అ.పా. పు. 68.

# 44

[ బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నముగ ముగిసినవి. ఉత్సవాలకు వచ్చిన సకలదేవతలకు తిరుమలప్రభువు వీడ్కోలు చెప్పుట ఇందలి వస్తువు ]

ముఖారి

పల్లవి :

భోగీంద్రులును మీరు - బోయి రండు
వేగగ మీఁదటి - విభవాలకు. ॥ భోగి ॥

చరణములు :

1. హంసుఁడ పోయిరా - అజుఁడ నీవునుఁబోయి
తిరిగిరా మీఁదటి - తిరుణాళ్లకు
సురలు మునులును మా - సురలుఁ బోయి రండు
అరవిరి నిన్నాళ్ల - నలసితిరి. ॥ భోగి ॥

2. జముఁడ పోయిరా - శశియు నీవునుఁబోయి
సుముఖుఁడవైరా - సురలఁగూడి
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయిరండు
ప్రమదాన నిన్నాళ్లు - బడలితిరి. ॥ భోగి ॥

3. నారద సనకస - నందనాదులు
భూరి విభవములఁ - బోయిరండు
మూరముగాఁ బోకిట్టే - తొరలి వేంకటగిరిఁ
జేరి నన్నిట్లనే - సేవించుఁడీ. ॥ భోగి ॥

[XI–పు. 320]

# 45

[ ఇది దంపుళ్ళపాట. కన్నెలు మనసులను కుదురులు చేసి, వలపులను నింపి, కనుచూపులతో దంపుళ్లు సాగించినారు. అంతా పాకంలో పడినప్పుడు కోనేటప్పను తమ కొంగులలో ముడి వేసుకోవచ్చుననే విశ్వాసం కాబోలు. భగవంతుడు భక్తుల పాలిటి కొంగుబంగారమే ]

* కేదారగౌళ

పల్లవి :

సువ్వి సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెద రోలాల. ॥ సువ్వి ॥

చరణములు :

1. పనితలు మనసులు కుందెన చేసిటు
వలపులు తగనించోలాల
కనుచూపు లనెడు రోకండ్లను
కన్నెలు దంచెద రోలాల. ॥ సువ్వి ॥

2. బంగరు చెఱఁగుల - పట్టు పుట్టములు
కొంగులు దూలఁగ నోలాల
అంగన లందరు - నతివేడుకతో
సంగడి దంచెద రోలాల. ॥ సువ్వి ॥

3. కురులు దూలఁగ మంచి - గుబ్బ చనులపై
సరులు దూలాడఁగ నోలాల
అరవిరి బాగుల - నతివలు ముద్దులు
గురియుచు దంచెద రోలాల. ॥ సువ్వి ॥

4. ఘల్లు ఘల్లు మను - కంకణ రవముల
పల్లవపాణుల నోలాల
ఒల్లన నడుములు - అసియాడుచు సతు
లొల్లనె చంచెద రోలాల. ॥ సువ్వి ॥

5. కప్పుర గంధులు - కమ్మనిపువ్వుల
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతిఁ - దేలుచుఁగోనే
టప్పనిఁ జాచెద రోలాల. ॥ సువ్వి ॥

[XII–352]

---

* చూడు – స్వరకల్పన, రా. అ. కృ. శర్మ. మిశ్రచాపుతాళం నిర్దేశింపబడింది.
రా. అ. పా. పు. 52

# 46

[ సృష్టికి పూర్వం విశ్వం ఏకోదకంగ ఉండగా దానిపై పరమాత్ముడు శుద్ధసత్వమూర్తియై తేలాడినాడట. తర్వాత అతడు తన నుండే బ్రహ్మాండాలను సృష్టించినాడట. ఈ పాటలో విషయం అదే. ]

* కాంభోజి

పల్లవి :

దిబ్బలు వెట్టుచుఁ - దేలిన దిదివో
ఉబ్బు నీటిపై - నొక హంస. ॥ దిబ్బలు ॥

చరణములు :

1. అనువునఁ గమల వి - హారమె నెలవై
ఒనరి యున్నదిదె - ఒక హంస
మనియెడి జీవుల - మానస సరసుల
వునికి నున్నదిదె - ఒక హంస. ॥ దిబ్బలు ॥

2. పాలు నీరు నేర్పఱచి పాలలో
నోల లాడెనిదె - యొక హంస
పాలుపడిన యీ - పరమ హంసముల
ఓలి నున్న దిదె - యొక హంస. ॥ దిబ్బలు ॥

3. తడవి రోమ రంధ్రంబుల గ్రుడ్ల
నుడుగక పొదిగీ - నొక హంస
కడు వేడుక వెంకటగిరి మీఁదట
నొడలు పెంచె నిదె - యొక హంస. ॥ దిబ్బలు ॥

[V–61]

* చూడు - స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. పు.

# 47

[ ఆతడుఎవ్వరైనా ఏమైనా మేమునమ్మిన దేవుడు. మా కులదైవం. మాకష్ట సుఖాలలో నిలిచిన ఏడుకొండలవాడే మా ఇలవేలుపు అని అన్నముడు ఆత్మవిశ్వాసంతో పలికిన మాటలివి. ]

*బౌళి

పల్లవి :

ఎండగాని నీడగాని - యే మైనాఁగాని
కొండలరాయఁడే మా - కులదైవము. ॥ ఎండ ॥

చరణములు :

1. తేలుగాని పాముగాని - చేవ పట్టయినఁగాని
గాలిగాని ధూళిగాని - కాని యేమైనా
కాలకూట విషమైన - గ్రక్కున మ్రింగిననాఁటి
నీలవర్ణుఁడే మా - నిజదైవము. ॥ ఎండ ॥

2. చీమగాని దోమగాని - చెలఁది యేమైనఁగాని
గాముగాని నాముగాని - కాని యేమైనా
పాముల నిన్నిటి మ్రింగే - బలుతేజిపై నెక్కు-
ధూమకేతువే మా - దొరదైవము. ॥ ఎండ ॥

3. పిల్లిగాని నల్లిగాని - పిన్న యెలుకైనఁగాని
కల్లగాని పొల్లగాని - కాని యేమైనా
బల్లిదుఁడై వెంకటాద్రి - పైనున్న యాతఁడే మ
మ్మెల్లకాలమును నేలే - యింటి దైవము. ॥ ఎండ ॥

[XI–పు. 274]

* చూడు—స్వరకల్పన రా. అ. కృ. శర్మ. "రూపక తాళము అథవా త్ర్యశ్రగతి ఏకతాళము" నిర్దేశింపబడింది. తా. పా Vo. 1 పు. 67.

# 48

[ ఇది గొప్ప సామ్యవాదసిద్ధాంతాన్ని తెలిపే పాట పరబ్రహ్మం అణువు మొదలు అజాండము వరకు సర్వత్ర వ్యాపించి ఉన్నది. జాతి వర్గ కుల మతభేదాలు పామరికమైనవి. వీనిని వదలి హరిని భజించి తరించండి అని భక్తుడు ప్రబోధిస్తున్నాడు.]

బౌళి

పల్లవి:

తందనాన ఆహి - తందనాన పురె
తందనాన భళా - తందనాన. ॥ తంద ॥

చరణములు:

1. బ్రహ్మ మొకటె పర - బ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే. ॥ తంద ॥

2. కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే - అంతరాత్మ
ఇందులో జంతుకుల - మింతా నొకటే
అందరికి శ్రీహరే - అంతరాత్మ. ॥ తంద ॥

3. నిండార రాజు నిద్రించు - నిద్రయు నొకటే
అండనే బంటునిద్ర - అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు - మెట్టుభూమి యొకటే
చండాలుఁ డుండేటి - సరిభూమి యొకటే. ॥ తంద ॥

1. అనఁగు దేవతలకును - అలకామ సుఖమొకటే
ఘనకీటపశువులకు - కామసుఖమొకటే
దిన మహో రాత్రములు - తెగి ధనాఢ్యునకొకటే
వొనర నిరుపేదకును - వొక్కటే అవియు. ॥ తంద ॥

5. కొరలి శిష్టాన్నములు - గొను నాఁకలొకటే
తిరుగు దుష్టాన్నములు - తిను నాఁకలొకటే
పరగ దుర్గంధములపై - వాయువొకటే
వరుసఁ బరిమళముపై - వాయువొకటే. ॥ తంద ॥

6. కడఁగి యేనుఁగు మీఁదఁ - గాయు యెండొకటే
పుడమి శునకము మీఁదఁ - బొలయునెండొకటే
కడుఁ బుణ్యులను బాప - కర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామమొకటే. ॥ తంద ॥

[VII-151]

# 49

[ఈ 'కూగూగు' పాటలో కృష్ణలీలలన్నీ తొణికిసలాడుతున్నవి.]

### శంకరాభరణం

పల్లవి:

గుఱుతెఱిఁగిన దొంగ - కూగూగు వీఁడె
గుదిలోనె దాఁగీని - కూగూగు. ॥ గుఱు ॥

చరణములు:

1. నెలఁతల దోఁచీని - నీళ్లాడఁగానె
కొలని దరిని దొంగ కూగూగు
బలువైన వుట్ల - పాలారగించీని
కొలఁది మీఱిన దొంగ - కూగూగు. ॥ గుఱు ॥

2. చల్లలమ్మంగ చనుకట్టు దొడికీని
గొల్లెతలను దొంగ - కూగూగు
యిల్లిల్లు దప్పక - యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ - కూగూగు. ॥ గుఱు ॥

3. తావుకొన్న దొంగఁ - దగిలి పట్టుండిదె
గోవులలో దొంగ - కూగూగు
శ్రీ వేంకటగిరి - చెలువుండో యేమొ
కోవిదుడు దొంగ - కూగూగు. ॥ గుఱు ॥

[IV–56]

# 50

[ ఈ గొబ్బిళ్ల పాట యదుకులతిలకుని నాయకునిగా చేసి కన్నె పిల్లలు పాడినది. గోపికలు తమ ఊహలలో ఉయ్యాలలూగిన వీర శృంగారమూర్తిని పారవశ్యంతో గానం చేసినారు. అన్నమయ్య ఆ గోపికలలో గోపికయై ఆడినాడు, పాడినాడు. ]

## *దేసాళం

పల్లవి:

కొలని దోఁపరికి - గొబ్బిళ్ళో యదు
కుల స్వామికి గొబ్బిళ్ళో. ॥ కొలని ॥

చరణములు :

1. కొండ గొడుగుగా - గోవులఁ గాచిన
కొండుక శిశువుకు -గొబ్బిళ్ళో
దుండగంపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి - గొబ్బిళ్ళో. ॥ కొలని ॥

2. పాప విధుల శిశు - పాలుని తిట్టుల
కోప గానికిని -గొబ్బిళ్ళో
యేపునఁ గంసుని -యిడుమలఁ బెట్టిన
గోపబాలునికి - గొబ్బిళ్ళో. ॥ కొలని ॥

3. దండి వైరులను - తఱిమిన దనుజుల
గుండె దిగులునకు - గొబ్బిళ్ళో
వెండిఁబైఁడి యగు - వెంకటగిరిపై
కొండలయ్యకును - గొబ్బిళ్ళో. ॥ కొలని ॥

[XII-98]

---

* చూడు – స్వరకల్పన– నే. కృ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా. అ. పా. పు. 135

# 51

[ వేంకటేశ్వరుని డోలావిహారమును, విశ్వలీలావిలాసమును కవి తాను అనుభవించి మనలను అనుభవింప చేసినాడు. కమనీయ మూర్తి వేంకటశైలపతికి జగమే ఉయ్యాల యాచినది. ]

* ఆహిరి

పల్లవి :

అలరఁ జంచలమైన - ఆత్మలందుడ నీ
యలవాటు సేసె నీ ఉయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస - పవనమందుండ నీ
భావంబు దెలిపె నీ - ఉయ్యాల. ॥ అలర ॥

చరణములు :

1. ఉదయాస్త శైలంబు - లొనరఁ గంబములైన
పుడుమండలము మోఁచె - నుయ్యాల
అదన నాకాశపద - మడ్డదూలంబైన
అఖిలంబు నిండె నీ - ఉయ్యాల
పదిలముగ వేదములు - బంగారు చేరులై
పట్టివెరపై తోఁచె - నుయ్యాల
వదలకిటు ధర్మదేవతపీఠమై మిగుల
వర్ణింప నరుదాయ - నుయ్యాల. ॥ అలర ॥

2. మేలుకట్లయి మీకు - మేఘమండలమెల్ల
మెఱుఁగునకు మెఱుఁగాయ - నుయ్యాల
నీలశైలము వంటి - నీమేని కాంతికిని
నిజమైన తొడవాయ - నుయ్యాల

పాలిండ్లు గదలఁగాఁ - బయ్యెదలు రాఁపాడ
భామినులు వడి నూఁచు నుయ్యాల
ఓలి బ్రహ్మాండములు - వొరగునోయనిభీతి
నొయ్యనొయ్యన వూఁచి - రుయ్యాల ॥ అలర ॥

3. కమలకును భూసతికి - కదలు కదలుకు మిమ్ముఁ
గౌఁగిలింపఁగఁ జేసె - నుయ్యాల
అమరాంగనలకు నీ - హావభావ విలాస
మందంద చూపెనీ - వుయ్యాల
కమలాసనాదులకుఁ - గన్నులకు పండుగై
గణుతింప నరుదాయ - నుయ్యాల
కమనీయమూర్తి వేం - కటశైలపతి నీకు
కడు వేడుకై యుండె - నుయ్యాల. ॥ అలర ॥

[XI–పు. 320]

* చూడు – స్వరకల్పన. రా. అ. కృ. శర్మ. ఝంపెతాళం నిర్దేశింపబడింది.
తా. పా. Vol. I పు. 131

# 52

[ లోకాలనేలే లోకేశ్వరునే జోకొట్టి జోలపాడిన అన్నమయ్య మాతృమూర్తి అయినాడు. ఈ అన్నమయ్య జోలపాడని తెలుగుతల్లి లేదు. వినని తెలుగు శిశువూ లేదు ]

* రాగం(?)-అటతాళం

పల్లవి :

జోవచ్యు తానంద - జోజో ముకుంద
రావె పరమానంద - రామ గోవింద. ॥ జోవ ॥

చరణములు :

1. నందు నింటను జేరి - నయము మీఱంగ
చంద్రవదనలు నీకు - సేవ చేయంగ
నందముగ వారింట్ల - నాడుచుండంగ
మందలకు దొంగ - మాముద్దురంగ. ॥ జోవ ॥

2. పాలవారాశిలో - పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుఁడై యుండి గో - పాలుఁడైనావు. ॥ జోవ ॥

3. అట్టుగట్టిన మీగ - డట్టె తిన్నాడే
పట్టి కోడలు మూతి - పై రాసినాడే
అట్టె తినెనని యత్త యడుగ విన్నాఁడే
గట్టిగా నిది దొంగ కొట్టుమన్నాడే ॥ జోవ ॥

4. గొల్లవారిండ్లకును - గొబ్బునకు బోయి
కొల్లలుగా త్రావి - కుండలను నేయి
చెల్లునా మగనాండ్ర - జెలిగి యీశాయీ
చిల్లతనములు సేయ - జెల్లునటవోయి ॥ జోవ ॥

5. రేపల్లె సతులెల్ల గోపంబుతోను
గోపమ్మ మీ కొడుకు మా యింద్లలోను
మాపుగానే వచ్చి - మామానములను
నీ పాపడే చెఱిచె - నేమందుమమ్మ ॥ జోవ ॥

6. ఒకని యాలినిదెచ్చి - నొకని కడబెట్టి
జగడములు గలిపించి - సతిపతులబట్టి
పగలు నలుజాములును - బాలుఁడై నట్టి
మగనాండ్ర జేపట్టి - మదనుఁడై నట్టి ॥ జోవ ॥

7. అంగజుని గన్న మా - యన్న యిటు రారా
బంగారు గిన్నెలోఁ - బాలు పోసేరా
దొంగ నీవని సతులు - పొంగుచున్నారా
ముంగిట నాడరా - మోహనాకార ॥ జోవ ॥

8. గోవర్ధనంబెల్ల - గొడుగుగాఁబట్టి
కావరమ్మైనను న్న - కంసుఁబడగొట్టి
నీవు మధురాపురము - నేలఁజేపట్టి
ఠీవితోనేలిన - దేవకీపట్టి ॥ జోవ ॥

9. అంగుగాఁ దాళ్ళపా - కన్నయ్య చాల
శృంగారరచనగాఁ జెప్పెనీ జోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల ॥ జోవ ॥

[అన్నమాచార్య చరిత్ర పీఠిక. పు. 61]

* ఈపాట ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు సంకలనం చేసిన శ్రీ అన్నమాచార్య సంకీర్తనలు తి. తి. దేవస్థానం ప్రచురణ 1951 నుండి గ్రహింపబడినది.

# 53

[ శ్రీమహాలక్ష్మికి మహాభక్తుడు అన్నమయ్య ఎత్తిపట్టిన నీరాజనం. అలమేల్మంగ చక్కదనాలకు ముత్యాల రతనాల నీరాజనాలే అవసరము లైనవి. ]

## మంగళకౌశిక

పల్లవి :

క్షీరాబ్ధికన్యకకు - శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయమునకు - నీరాజనం ॥ క్షీరా ॥

చరణములు :

1. జలజాక్షి మోమునకు - జక్కవకుచంబులకు
నెలకొన్న కప్పురకు - నీరాజనం
అలివేణి తురుమునకు - హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల - నీరాజనం. ॥ క్షీరా ॥

2. చరణకిసలయములకు - సకియ రంభోరులకు
నిరతమగు ముత్తేల - నీరాజనం
అరిది జఘనంబునకు - అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ - నీరాజనం. ॥ క్షీరా ॥

3. పగటు శ్రీవేంకటేశు - పట్టపురాణియై
నెగడు సతికళలకును - నీరాజనం
జగతి నలమేల్మంగ - చక్కఁదనముల కెల్ల
నిగుడు నిజశోభనపు - నీరాజనం. ॥ క్షీరా ॥

[శృంగా. సంకీ. రేకు. 1050]

# 54

[ దివ్యమంగళవిగ్రహుడైన శ్రీనివాసునికి మంగళము. జగన్మంగళ అయిన అలమేలుమంగకు మంగళము. ఈ మంగళ గీతాన్ని వినిన చదివిన - వ్రాసిన - పాడిన మనకందరికీ మంగళము కలుగుగాక!]

*రామక్రియ

పల్లవి :

మరలి మరలి జయ - మంగళము
సొరిది నిచ్చలును - శుభమంగళము ॥ మర ॥

చరణములు :

1. కమలారమణికి - కమలాక్షునకును
మమతల జయజయ - మంగళము
అమరజననికి - అమరవంద్యునకు
సుముహూర్తముతో - శుభమంగళము ॥ మర ॥

2. జలధికన్యకును - జలధిశాయికిని
మలయుచును శుభ - మంగళము
కలిమికాంతకా - కలికి విభునికిని
సులువుల యారతి - శుభ మంగళము. ॥ మర ॥

3. చిత్తజుతల్లికి - శ్రీ వేంకటపతికి
మత్తిల్లిన జయ - మంగళము
ఇత్తలనత్తల - ఇరువురకౌఁగిటి
జొత్తుల రతులకు - శుభ మంగళము. ॥ మర ॥

[V-273]

* చూడు— స్వరకల్పన. రా.అ.కృ శర్మ. ఆదితాళం నిర్దేశింపబడింది. తా. పా. Vol. II పు. 209

తాళ్లపాక అన్నమాచార్యులు: జననం: 9_5_1408

నిర్యాణం: 23_2_1503

రచనలు: తెలుగు

శృంగారసంకీర్తనలు: సుమారు 11526
[1921 రేకులు]

అధ్యాత్మ సంకీర్తనలు: 2209
[869 రేకులు]

శృంగారమంజరి

వేంకటేశ్వర శతకం.

(అలభ్యములు)

తెలుగు: ద్విపదరామాయణం

పదకొండు శతకాలు

(పేర్లు తెలియవు)

అనేక భాషలలో ప్రబంధాలు

(పేర్లు తెలియవు)

సంస్కృతం: వేంకటాచలమాహాత్మ్యం

సంకీర్తన లక్షణం.

బిరుదాలు: పదకవితా పితామహుడు

సంకీర్తనాచార్యుడు

పంచమాగమసార్వభౌముడు

ద్రవిడాగమసార్వభౌముడు

———

# అనుబంధం

—*—

**దినము ద్వాదశి ...**

ఈ పాట అన్నమాచార్యుల అధ్యా. రే. 136 లో ఉన్నది. వస్తువునుబట్టి పరిశీలిస్తే ఇది పెదతిరుమలయ్యదని తేలుతున్నది. సంకలనము చేసినవారి పొరబాటువలన కాబోలు ఇది అన్నమాచార్యుల పదాలలో చేరింది. అన్నమయ్య "శాలివాహన శక వరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర పాల్గుణ బ ౧౨" నాడు దివ్యధామముచేరినట్లు సంకీర్తన తొలి రాగిరేకుమీద మలచబడి వున్నది. అంటే "క్రీ. వె. 1503 ఫిబ్రవరి నెల 23-వ తేది గురువారమని తెలియుచున్నది". అని సాధు సుబ్రమణ్యశాస్త్రిగారు తెలిపినారు. [చూ. అనుబంధం, 7. పు. 98. ప్రథమ శ్రీ అన్నమాచార్యోత్సవక్రమము. టి. టి. డి. 1950]

**విన్నపాలు వినవలె ...**
1

'ఆళాపాల' రేకులోని పాఠం 'ఆలాపాల' అని సవరింపబడింది. [చూడు. తా. అ. పా. పు. 14]

**అలరులు గురియఁగ ...**
2

'వరుస పూర్వ' అనియే రేకుపాఠము. లయమునకు చాలదని 'వరుసగ' అను చేర్పు. [చూడు. తా. అ. పా. పు. 2]

**కులుకక నడవరో** ... 4
'జలజలన' పాట సౌకర్యార్థం 'న' తొలగింపబడింది. [చూ. తా. అ. పా. పు. 139]

**ఏమొకొచిగురుటధరమున** ... 7
ఈ పాట అన్నమాచార్యుడు పాడగా విన్న సాళ్వ నరసింగరాయలు 'ఇటువంటి పాటయే నామీద చెప్పుమని' అడిగినాడు. అన్నమయ్య తిరస్కరించినాడు. రాజు ఈ ధిక్కారాన్ని సహింపలేక అన్నమయ్యకు సంకెల వేసి చెరసాలలో త్రోయించినాడట. [చూడు. అన్నమాచార్య చరిత్ర. పు. 36_37]

**జవ్వాది మెత్తినది** ... 12
'ఇందలి ప్రతిపాదమందును 'అది' అను పదమును పాట సౌకర్యమునకు భావవ్యక్తికినై రేకులలో లేకున్నను చేర్చఁబడినది. ఇష్టములేనిచో వదల వచ్చును.' [చూడు. తా. పా. vol. I. పు. 16]

**మొత్తకురే అమ్మలాల** ... 16
'తాళ్ళ' అని రేకులోని పాఠం అన్వయం కుదరదు. 'రాళ్ళ' అని మార్చు. [చూ. తా. పా. పు. 20]

**ఇటిముద్దులాఁడి** ... 18
దీనిని తొలుత అధ్యాత్మ సంకీర్తనలు XI వ సంపుటంలో రా. అ. కృ. శర్మ గారు ప్రకటించినారు. ఇది అధ్యా. 30 నిడు రేకులోనిది. 'ఇది 38_వ రేకు

లోను గలదు. 3-వ చరణమున ' ఆస వాలకుఁడు ' అని పా.' అని క్రీగీతలో వారే సూచించినారు. శృంగార సంకీర్తనలు XII సంపుటం ద్వితీయ ముద్రణ పరిష్కరణలో ఈ పాటను శృం. సం. రేకు. 26 లోనిదిగా గుర్తించి గౌరిపెద్ది రామసుబ్బ శర్మ గారు ప్రకటించినారు. అందులోని కొన్ని ప్రధాన పాఠభేదాలు. కాఁగేటి (1 చరణం) ' ముంగై మురువుల ' ' తచ్చేటి ' (2 చరణం) పెట్టెలోన; ' చేయివెట్టి ', ' వేంకటేశుఁడాస పాలకుఁడు ' (3 చరణం). [చూడు. శృం. సం. XII పు. 100].

**ఉయ్యాలా ...** 22

1-వ చరణం 3-వ పాదంలో ' యెల్ల ' తొలగింపబడింది. 2, 3 చరణాలలో ' ధిమ్మి ', ' ఘల్లు ' శబ్దాలను పాట సౌకర్యార్థం అధికంగ చేర్చడం జరిగింది. [చూడు. తా.అ.పా. పు. 125]

**ఆఁకటి వేళల ...** 25

సాళ్వ నరసింగరాయలు అన్నముని చేతులకు సంకెల బిగించి చెరసాలలో త్రోయించిన సందర్భమున ఆ హరి భక్తుడు పాడిన పాటగా భావింపబడుతున్నది. [చూడు. అన్న. చరిత్ర. పు. 36—38]

**భావములోన ...** 26 — 1-వ చరణంలో 'బ్రహ్మాండము' అన్వయం కుదరదు. 'బ్రహ్మాండంబులు' అని మార్పు. 2-వ చరణంలో 'విష్ణు విష్ణువని' ముద్రిత ప్రతిలోని పాఠం. 'విష్ణువు విష్ణువని' మార్చబడింది. (తా. అ. పా. పు. 121)

**నారాయణతే నమోనమో ....** 27 — "నేఁటికిని దక్షిణ దేశమందలి హరిభజన సంప్రదాయమున 'తోడయ మంగళం' అనఁబడు తొలి పాటలలో నొక్కటిగా సర్వత్ర వ్యాప్తిలో నున్న ఈ సంకీర్తన మనకు నిడు రేకులలోనే దొరికినది. రాగము మాత్రము మారినది. రేకులో దీనిది పాడిరాగము. వ్యవహారములో ఇప్పుఁడిది మధ్యమావతి. దీనినే కడపటి చరణమున 'పురందర విఠలతే నమోనమో' అని మార్చి పురందరదాసరాయల పదముగా కర్ణాటకులు కొందరు వాడుచున్నారు" (రా. అ. కృ. శర్మ, చూ. అధ్యా. సం. XI పీఠిక పు. ii]

**శరణు శరణు ...** 29 — ఈ పాటను అనుకరించి పురందరదాసులవారు కూడ ఒక సంకీర్తనము రచించినట్లు కీ॥ శే॥ ప్రభాకర శాస్త్రిగారు సూచించినారు. [చూ. అన్న. చరిత్ర పు: 67]

ఇప్పుడిటు ... 31 — 'మేలుకంటి, మణిమయమగు' అను "మేలుకంటి, మణిమయమగు" అను రేకులోని పాఠము ఐదు మాత్రల తాళపు నడకకై స్వల్పముగ సవరింప బడినది. ఇట్లే 'హస్తమునుగంటి' అని సవరించుకొనుట చరణాల అంత్యాప్రాస కనురూపమగును. 'చయ్యన, గ్రక్కన, నంతట' అనుచోట్ల కడపటి లఘువును ఇంకొక మాత్రకాలము ఈడ్చి పాడదగును." [చూడు. తా. అ. పా. పు. 8]

పొడగంటిమయ్యా ... 33 — ఈపాట శేషాచార్యులవారిచ్చిన వ్రాత ప్రతిలోనిదని కీ. శే. ప్రభాకరశాస్త్రి గారు, శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు పేర్కొనిరి. ఇందు రాగముతో బాటు తాళము కూడ పేర్కొనబడినది. ఈ పాట తాళ్ళపాక కవులలో ఎవరిదో నిర్దేశింపబడలేదు.

కంటి శుక్రవారము ... 36 — ఇదికూడ శేషాచార్యులవారి వ్రాత ప్రతిలోనిదే. రాగంకూడ పేర్కొన బడలేదు. ఇది తాళ్ళపాక కవులలో ఎవరిదో నిర్దేశింపబడలేదు.

కొనరోకొనరో ... 41 — 3-వ చరణములో 'యొసగిన' అను ముద్రితపాఠము అనన్వితము కాబట్టి 'యొసగిన' అని మార్చబడినది. 'ధ్వజ

మెత్తి కోనేటి' అని సరియైనపాఠము గాఁబోలు' నని రా. అ. కృ. శర్మగారు సూచించిరి. [చూడు. తా. పా. vol. II పు. 134]

సువ్విసువ్వి ... 48 — రేకులో పల్లవికి 'సువ్వి' లు మూఁడే యున్నను పాటనింపుకై ఇంకొకటి ఇందు చేర్చబడినది. [చూడు. తా. అ. పా. పు. 53]

క్షీరాబ్ధికన్యకకు ... 53 — ఈ మధురమైనపాట శృం. సం. రేకు 1050 లోనిది. పూజ్యులు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు దీనిని రేకునుండి పరిష్కరించి ప్రచురించుటకు సిద్ధము చేసినారు. ఇంతవరకు అప్రకటితమైన ఈ పాటను వారి అనుమతితో ఈ సంకలన గ్రంథంలో చేరుస్తున్నాను.

మరలి మరలి ... 54 — 'జయం మంగళం' అను రేకులోని పాఠమున తాళమున కొక మాత్ర యెక్కువ: 'మత్తిల్లి జయం' అని యైనను సవరింపఁదగును. [రా. అ. కృ. శర్మ. చూడు. తా. పా. vol. I పు. 210.]

---

గమనికః— పు. 14, 3 వ చరణం చివర 'సలుకలు చవి చేసె' అని సవరించుకొని చదువుకో ప్రార్థన.

T. T. D. Religious Publications Series No. 128.

Price : Rs. 2–25

శ్రీః

క. పావనములు హరిభక్తి వి
భావనములు సర్వమంత్ర పరమరహస్యో
ద్భావనములు గాయకనిక
రావనములు తాళ్ళపాక యన్నయపదముల్.

క. రంజనములు దుర్గుణగణ
భంజనములు విమలకమలభవజనకగుణా
సంజనములు సుజ్ఞాన ధ
నాంజనములు తాళ్ళపాక యన్నయపదముల్.

క. వేదంబులు పౌరాణిక
వాదంబులు వరకవిత్వవాణీ వీణా
నాదంబులు కృతసుజనా
హ్లాదంబులు తాళ్ళపాక యన్నయపదముల్.

క. లక్షణములు పదకవితా
రక్షణములు వివిధకుకవిరాజీ మదసం
మోక్షణములు వేంకటపతి
వీక్షణములు తాళ్ళపాకవిభుసత్కవితల్.

(చినతిరుమలాచార్యుని సంకీర్తనలక్షణము)

Printed and Published by G. Kumaraswamy Reddy, I.A.S., Executive Officer, T.T.D. and Printed at T.T.D. Press, Tirupati—C. 5,000—7-8-82